# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - మంగళవారం 29 ఏప్రిల్ 2025 | సంపుటి:9 | సంచిక:123 | పేజీలు:8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA| HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM |




## లోకాయుక్త ప్రమాణ స్వీకారం

రాష్ట్ర లోకాయుక్త, ఉప లోకాయుక్త ప్రమాణ స్వీకారం చేశారు. లోకాయుక్తగా జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డి, ఉప లోకాయుక్తగా బీఎస్ జగ్జీవన్ కుమార్ తో

...మిగతా 2లో

## తెలుగుదనం ఉట్టిపడేలా బాలకృష్ణ ఆహార్యం



2



## పద్మ అవార్డుల ప్రదానోత్సవం

పద్మవిభూషణ్ అందుకున్న డా.నాగేశ్వర్ రెడ్డి

పద్మభూషణ్ స్వీకరించిన బాలకృష్ణ

పద్మ శ్రీ పొందిన నాగఫణి శర్మ

ఢిల్లీ, ఏప్రిల్ 28: పలు రంగాల్లో విశేష సేవలందించిన ప్రముఖులకు భారత గణతంత్ర దినోత్సవం వేళ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'పద్మ' అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఢిల్లీలోని

...మిగతా 2లో

పహల్గాంపై పగోళ్లకు గుణపాఠం చెప్పేటందుకు..

# హై లెవల్ భేటీలు

గుంభనంగా జరుగుతున్న పరిణామాలు

పార్లమెంట్ ప్రాంగణంలో వరుస సమావేశాలు



ఢిల్లీ, ఏప్రిల 28: దేశమంతా ఉలిక్కి పడేలా జరిగిన పహల్గాం ఉగ్రదాడిపై మరిన్ని చర్యలు తీసుకోవడానికి, ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దాయాదికి గుణపాఠం చెప్పేందుకు మోడీ ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలోనే పార్లమెంట్ ప్రాంగణంలో రక్షణ వ్యవహారాలపై స్టాండింగ్ కమిటీ సమావేశమైంది. ఎంపీలు రాధా మోహన్ సింగ్, రాహుల్ గాంధీ, విష్ణుపాల్ రే, జగన్నాథ్ సర్కార్, శక్తి సింగ్ గోహిల్, సంజయ్ సింగ్ సమావేశంలో పాల్గొన్నారు. అంతకు ముందు సోమవారం ఉదయం ప్రధానమంత్రితో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ భేటీ అయ్యారు. దాదాపు

...మిగతా 2లో

## దాయాది గుండెల్లో గుబులు

2



2

# ఐటీ గురించి మాట్లాడితే ఆశ్చర్య పోయారు

ఇప్పుడు క్వాంటమ్ కంప్యూటర్స్ రాబోతున్నాయి

విల్ కాలేజీ క్యాంపస్‌లో చంద్రబాబు ప్రసంగం

### విశాఖను ఆర్థిక రాజధానిగా, తిరుపతిని ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దుతాం

**అమరావతి:** అమరావతి అందరిదని.. రాష్ట్రానికి ఆత్మ వంటిదని సీఎం చంద్రబాబు అన్నారు. కూటమి నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. రాజధాని పునఃనిర్మాణ పనులతో అభివద్ధికి మళ్లీ ఊపిరి లభించిందన్నారు. సభకు తరలివచ్చే

...మిగతా 2లో

### రాజధాని పనుల పునఃప్రారంభ కార్యక్రమం.. రైతులకు ఆహ్వానం పలికిన చంద్రబాబు

**అమరావతి:** అమరావతి పనుల పునఃప్రారంభ కార్యక్రమానికి రావాలంటూ రాజధాని రైతులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆహ్వానించారు. మే 2వ తేదీ రాష్ట్ర చరిత్రలో కీలక మలుపు అవుతుందని, రాజధాని

...మిగతా 2లో

## భారత్‌పై విషం కక్కుతున్న పాక్ యూట్యూబ్ చానెళ్లు

డాన్, జియో న్యూస్ వంటి యూట్యూబ్ చానెళ్లపై నిషేధం

పహల్గామ్ దాడిపై బిబిసి వార్తకు కూడా ఖండన

న్యూఢిల్లీ: భారత్ గురించి 'తప్పుడు, రెచ్చగొట్టే, మతపరంగా సున్నితమైన అంశాలను' ప్రసారం చేస్తున్నాయనే ఆరోపణపై 16 పాకిస్తానీ యూట్యూబ్ చానెళ్లను కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. అదే సమయలో పహల్గామ్ దాడిపై బిబిసి ప్రసారం చేసిన వార్తకు కూడా కేంద్రం తీవ్ర స్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేసిందని అధికారులు సోమవారం వెల్లడించారు. జమ్మూ కాశ్మీర్‌లోని పర్యాటక పట్టణం పహల్గామ్ మైదాన ప్రాంతంలో ఈ నెల 22వ ఉగ్ర దాడి నేపథ్యంలో కేంద్ర హోమ్ మంత్రిత్వశాఖ సిఫార్సు మేరకు ప్రభుత్వం ఈ చర్య తీసుకున్నది. ఆ దాడిలో పర్యాటకులతో సహా 26 మంది వ్యక్తులు హతులైన విషయం విదితమే. ఉగ్రవాదులను తీవ్రవాదులుగా పేర్కొన్న బిబిసి ప్రసారం చేసే వార్తలను

...మిగతా 2లో

## లాభాల్లోకి వచ్చిన దేశీయ స్టాక్ మార్కెట్లు




న్యూఢిల్లీ: దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ లాభాల్లో ముగిశాయి. గత సెషన్‌లో సూచీలు పహల్గాంలో ఉగ్రవాదుల దాడి తర్వాత భారత్-పాకిస్తాన్ మధ్య పెరిగిన ఉద్రిక్తల కారణంగా మార్కెట్లు- పతనమయ్యాయి. అయితే, వారంలో తొలిరోజైన సోమవారం లాభాల్లో ప్రారంభమయ్యాయి. విదేశీ పెట్టు-బడులు కొనసాగడం.. బ్లూ చిప్ స్టాక్స్ రాణించడంతో మార్కెట్లు- లాభాల్లో కొనసాగాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ సెన్సెక్స్ 79,343.63 పాయింట్ల లాభాల్లో మొదలైంది. ఏ దశలోనూ మళ్లీ వెనక్కి తగ్గకుండా వరుస సెషన్లలో లాభాల్లో ట్రేడయ్యింది. ఈ క్రమంలో సెన్సెక్స్ 80,321.88 పాయింట్ల గరిష్ఠానికి చేరింది. చివరకు 1,005.84 పాయింట్ల లాభంతో 80,218.37 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 272.90 పాయింట్లు- పెరిగి.. 24,312.25 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో దాదాపు 1,877 షేర్లు లాభపడ్డాయి. మరో 1,961 షేర్లు పతనయ్యాయి. నిఫ్టీలో అత్యధికంగా రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎస్‌బీఐ లైఫ్, భారత్ ఎలక్ట్రానిక్స్, సన్ ఫార్మా, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ అత్యధికంగా లాభపడ్డాయి. శ్రీరామ్ ఫైనాన్స్, హెచ్‌సీఎల్ -టె-క్నాలజీస్, ఎటర్నల్, అల్ట్రా-టె-క్ సిమెంట్, హెచ్‌యూఎల్ నష్టపోయాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.3 శాతం పెరిగింది. స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.4 శాతం పెరిగింది. ఐటీ- మినహా మిగతా అన్ని రంగాల సూచీలు మెటల్, రియాల్టీ, ఆయిల్, గ్యాస్, ఫార్మా, పీఎస్‌యూ బ్యాంక్ ఒకటి నుంచి 3శాతం పెరిగాయి.

## ఎన్‌డిఏ రాజ్యసభ అభ్యర్థిగా పాకా

ఖరారు చేసిన బిజెపి అధిష్టానం



**అమరావతి:** ఏపీలో ఖాళీ అయిన రాజ్యసభ స్థానం భర్తీపై ఎట్టకేలకు ఉత్కంఠ వీడింది. మందకృష్ణ పేరు ఖరారు అవుతుందన్న ఊహాగానాలకు తెరదించారు. ఎన్డీయే అభ్యర్థిగా పాకా వెంకటసత్యనారాయణను అధిష్ఠానం ప్రకటించింది. ఆయన ప్రస్తుతం ఏపీ భాజపా క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్‌గా ఉన్నారు. విజయసాయిరెడ్డి రాజీనామాతో రాజ్యసభలో ఒక స్థానం ఖాళీ అయ్యింది. మరో రెండేళ్ల పదవీ కాలం ఉన్న నేపథ్యంలో ఉపఎన్నికకు ఎన్నికల సంఘం ఇటీ-వల నోటిఫికేషన్ విడుదల చేసింది. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలతో నామినేషన్ గడువు ముగియనున్న నేపథ్యంలో.. భాజపా ఏపీ కోర్ కమిటీ- సమావేశమైంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి యూరప్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. పాకా వెంకటసత్యనారాయణవైపు మొగ్గు చూపిన పార్టీ అధిష్ఠానం ..ఆయన్ని అభ్యర్థిగా ఖరారు చేసింది. దీంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు.

## ఏపీలో రాజ్యసభ స్థానం ఖాళీ.. భర్తీపై ఉత్కంఠ

**అమరావతి:** ఏపీలో ఖాళీ అయిన రాజ్యసభ స్థానం భర్తీపై ఉత్కంఠ కొనసాగుతోంది. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలతో నామినేషన్ గడువు ముగుస్తున్న నేపథ్యంలో కూటమి తరఫున ఇప్పటి వరకు అభ్యర్థిని ఖరారు చేయకపోవడంతో ఉత్కంఠ నెలకొంది. మరోవైపు భాజపా కోటాలో రాజ్యసభ స్థానం భర్తీ కానున్నట్లు తెలుస్తోంది.

ఇటీవల విదేశీ పర్యటనకు వెళ్లి తిరుగుపయనంలో దిల్లీలో కేంద్ర రె మంత్రి అమిత్‌షాను కలిసిన చంద్రబాబు.. ఈ స్థానానికి ఎస్సీ వర్గీకరణలో కీలకంగా వ్యవహరించిన నేత, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకష్ణ మాదిగ పేరును సిఫార్సు చేసినట్లు సమాచారం. విజయసాయిరెడ్డి రాజీనామాతో రాజ్యసభలో ఒక స్థానం ఖాళీ అయ్యింది. మరో రెండేళ్ల పదవీ కాలం ఉన్న నేపథ్యంలో ఉపఎన్నికకు ఇటీవల నోటిఫికేషన్ విడుదలైంది. ఏపీ నుంచి రాజ్యసభ రేసులో తమిళనాడుకు చెందిన అన్నామలై, కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీ కూడా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

## ఆ నలుగురి కోసం వేట..





4 టైమ్స్ జస్ట్ మిస్సడ్

ఢిల్లీ, ఏప్రిల్ 28:పహల్గాం ఉగ్రదాడి నిందితుల కోసం వేట కొనసాగుతున్నది. ఆ నలుగురు ముష్కరుల లొకేషన్లను నాలుగుసార్లు ట్రాక్ చేయగా త్రుటిలో తప్పించుకొన్నారు. ఈ క్రమంలో ఓసారి భద్రతా దళాలు, ఉగ్రవాదులకు మధ్య కాల్పులు జరిగాయి. దక్షిణ కశ్మీర్లోని అడవుల్లో ఈ ముష్కర దళాలు పలు సందర్భాల్లో వారికి అత్యంత దగ్గరగా వచ్చాయని ఇక ఆంగ్ల దినపత్రిక పేర్కొంది. ముఖ్యంగా స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఇంటెలిజెన్స్ ఎప్పటికప్పుడు వారి లొకేషన్లను గుర్తిస్తున్నారు. ''ఎలుకా పిల్లి ఆటలా సాగుతోంది.. వారు మా కనుచూపు మేరలోకి వచ్చినా.. కాల్పులు జరిపి తప్పించుకొంటున్నారు. ఇక్కడ అడవులు అత్యంత చిక్కగా ఉన్నాయి. మనకు కనిపిస్తున్నా ధ్రువీకరించుకోవాల్సి ఉంటుంది. వారిని పట్టుకొని తీరతాం. కొన్ని రోజులు మాత్రమే మిగిలిఉంది'' అని ఓ సైనిక అధికారి పత్రికలతో చెప్పారు.

### పక్కా సమాచారంతోనే..

ఉగ్రవాదులను తొలుత అనంతనాగ్ లోని పహల్గాం తెహస్లీ వద్ద గుర్తించారు. కానీ, దళాలు అక్కడికి చేరేలోపు వారు చిక్కటి అడవుల్లోకి పారిపోయారు. ఆ తర్వాత కుల్గాం అడవుల్లో వారి కదలికలు కనిపించాయి. అక్కడికి చేరుకొన్న భద్రతా దళాలపై

...మిగతా 2లో

## ఆపరేషన్ కగార్‌ను తక్షణమే ఆపేయాలె

బేషరతుగా శాంతి చర్చలు జరపాలె

మావోయిస్టు అగ్ర నేత అభయ్ సంచలన లేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 28: ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపేయాలని, తమతో శాంతి చర్చలు జరపాలని మావోయిస్టులు ప్రకటించారు. సోమవారం సాయంత్రం మావోయిస్టు అగ్రనేత అభయ్ పేరుతో లేఖ విడుదలైంది. షరతులు లేకుండా చర్చలు జరుపాలని లేఖలో పేర్కొన్నారు. కాగా, తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో కొన్నాళ్లుగా భద్రతా బలగాలు వరుస

...మిగతా 2లో

## మరికొన్ని నామినేటెడ్ పోస్టుల భర్తీ

డిసిసిబి, డిసిఎంఎస్ ఛైర్మన్ల నియామకం

**అమరావతి:** ఏపీలో పలు నామినేటెడ్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. 10 జిల్లాలకు సహకార బ్యాంకు (డీసీసీబీ), జిల్లా సహకార మార్కెటింగ్ సంఘాల (డీసీఎంఎస్) ఛైర్మన్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీకాకుళం డీసీసీబీ ఛైర్మన్‌గా శివ్వల సూర్యనారాయణ (తెదేపా), విశాఖ డీసీసీబీ ఛైర్మన్‌గా కోన తాతారావు (జనసే) నియమితులయ్యారు.డీసీసీబీ ఛైర్మన్లుగా నియమితులు అయిన వారిలో విజయనగరం - కిమిడి నాగార్జున (తెదేపా), గుంటూరు - మాకినేని మల్లికార్జునరావు (తెదేపా),కృష్ణా - నెట్టెం రఘురామ్ (తెదేపా), నెల్లూరు -ధనుంజయరెడ్డి (తెదేపా), చిత్తూరు - అమాస రాజశేఖర్‌రెడ్డి (తెదేపా), అనంతపురం - కేశవరెడ్డి (తెదేపా), కర్నూలు - డి.విష్ణువర్ధన్‌రెడ్డి (తెదేపా), కడప - బి.సూర్యనారాయణ రెడ్డి (తెదేపా) ఉన్నారు. డీసీఎంఎస్ ఛైర్మన్లుగా శ్రీకాకుళం - అవినాష్ ఛౌదరి (తెదేపా),

...మిగతా 2లో

### రష్యా 'విక్టరీ డే'.. ఉక్రెయిన్‌లో కాల్పుల విరమణ!

మాస్కో, ఏప్రిల్ 28: ఉక్రెయిన్‌లో వచ్చే నెల 8 నుంచి 10వ తేదీవరకు కాల్పుల విరమణ పాటిస్తామని రష్యా ప్రకటించింది. ఉక్రెయిన్‌లో రష్యా తాత్కాలిక కాల్పుల విరమణను ప్రకటించింది. విక్టరీ డే నేపథ్యంలో వచ్చే నెల 8 నుంచి 10వ తేదీవరకు పూర్తిస్థాయి కాల్పుల విరమణ పాటిస్తామని క్రెమ్లిన్ వెల్లడించింది. మానవతా

...మిగతా 2లో

## జిన్‌పింగ్ ఫోన్ చేశారన్న ట్రంప్

అలాంటిదేమీ లేదన్న చైనా



హాంకాంగ్, ఏప్రిల్ 28: చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో తాను ఫోన్లో మాట్లాడనంటూ అమెరికా అధినేత డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై బీజింగ్ స్పందించింది.ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక శక్తులైన అమెరికా, చైనా మధ్య పరస్పర టారిఫ్లతో వాణిజ్య యుద్ధం రాజుకుంది. సుంకాల విషయంలో రెండు దేశాలూ తగ్గేదేలే అన్నట్లుగా వ్యవహరించాయి. ఈ పరిణామాల వేళ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల ఆసక్తికర

...మిగతా 2లో

## దాయాది గుండెల్లో గుబులు

ఢిల్లీ, ఏప్రిల్ 28: ఉగ్రదాడులకు ఊతమిస్తున్న పాకిస్తాన్‌పై ఏ క్షణంలో అయినా భారత్ దాడి చేసే అవకాశముందన్న సమాచారంతో దాయాది దేశం గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలోనే పీవోకేలోని ఉగ్రవాద లాంచ్ ప్యాడ్లను ఆ దేశ సైన్యం ఖాళీ చేయిస్తున్నట్లు తెలుస్తోంది. వారిని ఆర్మీ షెల్టర్లు, బంకర్లకు తరలిస్తున్నట్లు నిఘా వర్గాల సమాచారంగా జాతీయ మీడియా కథనాలు ప్రచురిస్తోంది. భారత భద్రతా సంస్థలు క్రియాశీలకంగా ఉన్న టెర్రరిస్టుల లాంచ్ ప్యాడ్లను గుర్తించిన నేపథ్యంలో పాక్ ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. పీఓకేలోని కెల్, సర్ది, దుధ్నియల్, అత్ముఖం, జురా, లిపా, పచ్చిబన్, ఫార్వర్డ్ కహుతా, కొట్లి వంటి పలు ప్రాంతాల నుంచి ఉగ్రవాదులను తరలిస్తున్నట్లు నిఘా వర్గాల సమాచారం. ఉగ్రవాదులు జమ్మూకశ్మీర్లోకి చొరబడటానికి ముందు వారు నివసించే కీలక కేంద్రాలుగా ఈ లాంచ్ ప్యాడ్లు పనిచేస్తాయి. వీటిలో 150 నుంచి 200 మంది శిక్షణ పొందిన ఉగ్రవాదులు ఉన్నారని, వారంతా చొరబాటుకు సిద్ధంగా ఉన్నారని సమాచారం.

# 'పద్మ' అవార్డుల ప్రదానోత్సవం




(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రపతి భవన్ లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సోమవారం సాయంత్రం ఈ అవార్డులను అందజేశారు.

తెలుగు రాష్ట్రాల నుంచి వైద్య విభాగంలో పద్మవిభూషణ్ పురస్కారానికి ఎంపికైన డాక్టర్ దువ్వూరు నాగేశ్వర్ రెడ్డి, కళా రంగంలో పద్మభూషణ్ కు ఎంపికైన సినీ నటుడు బాలకృష్ణ, పద్మశ్రీకి ఎంపికైన మాడుగుల నాగఫణిశర్మ రాష్ట్రపతి చేతుల మీదుగా ఈ విశిష్ఠ పౌర పురస్కారాలను అందుకున్నారు. అలాగే, సినీ నటుడు అజిత్, క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ తదితరులు నేడు 'పద్మ' అవార్డులను అందుకున్నారు. ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, రామ్మోహన్ నాయుడు, శివరాజ్ సింగ్, చౌహాన్, జితేంద్రసింగ్ తో పాటు ఏపీ మంత్రి నారా లోకేశ్, ఆయన సతీమణి బ్రాహ్మణి, పలువురు ప్రముఖులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ ఏడాది ఏడుగురికి పద్మవిభూషణ్, 19 మందికి పద్మభూషణ్, 113 మందికి పద్మశ్రీ పురస్కారాలను కేంద్రం ప్రకటించిన విషయం తెలిసిందే. వీరిలో నేడు దాదాపు సగం మందికి పురస్కారాలను ప్రదానం చేశారు.

# హై లెవల్ భేటీలు

(మొదటి పేజీ తరువాయి)

40 నిమిషాల పాటు ఈ సమావేశం జరిగింది. దీనికన్నా ముందు భారత్ తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు ఆదివారం రాజ్‌నాథ్, సీడీఎస్ జనరల్ అనిల్ చౌహన్‌ల భేటీ జరిగింది. ఆ సమావేశంలో మన సైన్యం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. రక్షణ, భద్రత బాధ్యలతో జరిగిన చర్చల వివరాలను రక్షణమంత్రి నేడు ప్రధానికి వివరించారు. ఈ భేటీలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్ కూడా పాల్గొన్నారు.

ఉగ్రదాడి తర్వాత కేంద్రం అఖిలపక్ష భేటీ నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ ఘటన వెనుక భద్రతా వైఫల్యం ఉందని, దాడి జరిగిన వెంటనే ప్రభుత్వం సరిగా స్పందించలేదని విపక్షాలు వ్యాఖ్యానించాయి. దాడి జరిగిన సమయంలో భద్రతా బలగాలు, సీఆర్పీఎఫ్ ఎక్కడున్నాయి? అని పలు నేతలు ప్రశ్నించారు. దీనికి ప్రభుత్వం తరఫు నుంచి ఓ కేంద్రమంత్రి బదులిస్తూ.. ''సాధారణంగా జూన్ నుంచి ప్రారంభమయ్యే అమర్ నాథ్ యాత్ర వరకు ఈ లోయ వద్దకు పర్యాటకులు వెళ్లకుండా ఆంక్షలు అమల్లో ఉంటాయి. కానీ, ఈసారి భద్రతా ఏజెన్సీలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే స్థానిక అధికారులు బైసరన్ కు పర్యాటకులను అనుమతించారు'' అని పేర్కొన్న సంగతి తెలిసిందే. ప్రభుత్వ స్పందనపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. వేల మంది టూరిస్టులు అక్కడకు వెళ్తుంటే.. ప్రభుత్వానికి తెలియకపోవడం ఏంటని ఆయన ప్రశ్నించినట్లు వార్తలు వెలువడ్డ విషయం పాఠకులకు విదితమే.

### రష్యా 'విక్టరీ డే'.. ఉక్రెయిన్లో

## కాల్పుల విరమణ!

(మొదటి పేజీ తరువాయి)

దృక్పథంతో దేశాధ్యక్షుడు పుతిన్ ఈమేరకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపింది. యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న వేళ ఈ ప్రకటన వెలువడింది. రెండో ప్రపంచ యుద్ధంలో నాజీ జర్మనీపై విజయానికి గుర్తుగా రష్యా ప్రభుత్వం ఏటా మే 9న విక్టరీ డే వేడుకలు నిర్వహిస్తుంది.

# ఆ నలుగురి కోసం వేట..

(మొదటి పేజీ తరువాయి)

కాల్పులు జరిపి పారిపోయారు. అనంతరం తిరిగి త్రాల్ కొండల్లో వారు ఉన్నట్లు దళాలు గుర్తించాయి. అక్కడి నుంచి వారు జారుకొన్నాక కొకెర్నాగ్లో లొకేషన్ బయటపడింది. వారు ప్రస్తుతం ఈ ప్రాంతం చుట్టుపక్కలే ఉండొచ్చని చెబుతున్నారు. ఒక గ్రామంలోని ఇంట్లో వారు రాత్రి భోజనానికి వెళ్లగా అక్కడికి దళాలు చేరుకోవడంతో.. ఆహారం తీసుకొని వారు పారిపోయినట్లు సైనికాధికారి వెల్లడించారు. ప్రస్తుతం ఉగ్రవాదులు తమకు అవసరమైన నిత్యావసరాల సేకరణలో అత్యంత



అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. సాధారణంగా వీరు గ్రామాల సమీపంలోకి వెళ్లినప్పుడు అక్కడ ఉండే స్థానిక సహాయకులను సంప్రదించి అడవుల్లోకి ఆహారం తెప్పించుకొంటారు. ఆ సమయంలో దళాలకు హ్యూమన్ ఇంటెలిజెన్స్ లభిస్తుంది. కానీ వీరు చాలా అప్రమత్తంగా ఉన్నారని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఆర్మీ, సీఆర్పీఎఫ్, జమ్మూకశ్మీర్ పోలీసులు పహల్గాం చుట్టుపక్కల అడవులను జల్లెడ పడుతున్నారు. ఉగ్రవాదులు బైసరన్ లోయలో కొందరు సందర్శకుల నుంచి మొబైల్ ఫోన్లు లాక్కొన్నారు.

## ఆపరేషన్ కగార్‌ను తక్షణమే ఆపేయాలె

(మొదటి పేజీ తరువాయి)

ఎన్ కౌంటర్లకు దిగుతున్నారు. ఈ ఎదురుకాల్పుల్లో వందలాది మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోతున్నారు. నిన్నా, మొన్నటివరకు ఛత్తీస్గఢ్ అడవుల్లో కాల్పులు జరుపగా, ఇప్పుడు భూపాలపల్లి సరిహద్దు వరకూ జల్లెడ పడుతున్నారు. మరోవైపు కర్రిగుట్టలో కూంబింగ్ కొనసాగుతోంది. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా ఆపరేషన్ కగార్ ను తీవ్రం చేశారు. ఈ వరుస ఎదురుకాల్పుల నేపథ్యంలో మావోయిస్టులతో శాంతి చర్చలు జరగాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. దీనిపై పలు రాజకీయ పార్టీల నేతలు సైతం స్పందిస్తున్నారు. శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే విడుదలైన మావోయిస్టుల లేఖ ప్రాధాన్యత సంతరించుకుంది.

## తెలుగుదనం ఉట్టిపడేలా..బాలకృష్ణ ఆహార్యం..



ఢిల్లీ, ఏప్రిల్ 28: తెలుగుదనం ఉట్టిపడేలా పంచె కట్టులో 'పద్మ' అవార్డుల ప్రదానోత్సవానికి హాజరయ్యారు బాలకృష్ణ. ఢిల్లీలోని మాన్సింగ్ రోడ్డు నుంచి రాష్ట్రపతి భవన్ కు కుటుంబంతో కలిసి ఆయన బయలుదేరిన దృశ్యాలు నెట్టింట వైరల్ అయ్యాయి.

నట సార్వభౌముడు నందమూరి తారకరామారావు తనయుడిగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి.. తండ్రి అడుగు జాడల్లో ప్రయాణించి నటుడిగా ప్రశంసలు దక్కించుకున్నారు బాలకృష్ణ. గతేడాది 50 ఏళ్ల సినీ ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నారు. పౌరాణికం, జానపదం, సాంఘికం, సైన్స్ ఫిక్షన్, బయోపిక్.. ఇలా అన్ని జానర్లను టచ్ చేసిన ఏకైక అగ్ర నటుడిగా ఆయన తెలుగు ప్రేక్షకుల మది దోచుకున్నారు. క్యాన్సర్ ఆస్పత్రి ఛైర్మన్ గా ఉన్నారు. ఈ సేవలందించినందుకే కేంద్ర ప్రభుత్వం ఆయనకు 'పద్మభూషణ్'పురస్కారాన్ని ప్రకటించింది.

## మరికొన్ని నామినేటెడ్ పోస్టుల భర్తీ

(మొదటి పేజీ తరువాయి)

విశాఖ - కొట్ని బాలాజీ (తెదేపా), విజయనగరం - గొంప కృష్ణ (తెదేపా), గుంటూరు - వడ్రాణం హరిబాబు (తెదేపా), కృష్ణా - బండి రామకృష్ణ (జనసేన), నెల్లూరు - గొనుగోడు నాగేశ్వరరావు (తెదేపా), చిత్తూరు - సుబ్రమణ్యం నాయుడు (తెదేపా), అనంతపురం - నెట్టెం వెంకటేశ్వర్లు (తెదేపా), కర్నూలు - జి.నాగేశ్వరయాదవ్ (తెదేపా) కడప - యర్రగుండ్ల. జయప్రకాశ్ (తెదేపా) ఉన్నారు.

# జిన్‌పింగ్ ఫోన్ చేశారన్న ట్రంప్

(మొదటి పేజీ తరువాయి)

వ్యాఖ్యలు చేశారు. జిన్‌పింగ్ తనతో ఫోన్లో మాట్లాడినట్లు తెలిపారు. అయితే, దీన్ని చైనా తోసిపుచ్చింది. ఇటీవలి కాలంలో వారి మధ్య ఎలాంటి ఫోన్ సంభాషణలు జరగలేదని తేల్చిచెప్పింది.చైనా అధినేత తన స్నేహితుడంటూ పలువార్లు వ్యాఖ్యానించిన ట్రంప్.. గతవారం టైమ్ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో జిన్‌పింగ్ గురించి ప్రస్తావించారు. ''ఆయన (జిన్పింగ్) ఫోన్ చేశారు. అయితే, దీన్ని ఆయన బలహీనతగా నేను చూడట్లేదు. దానిపై నేను స్పందించాలనుకోవడం లేదు కూడా..! మేమిద్దరం చాలా సార్లు మాట్లాడుకున్నాం'' అని తెలిపారు. అయితే, జిన్‌పింగ్‌తో ఎప్పుడు మాట్లాడారు..? దేని గురించి చర్చించారన్న విషయాలను మాత్రం అమెరికా అధ్యక్షుడు వెల్లడించలేదు.

ఈ వ్యాఖ్యలపై చైనా విదేశాంగశాఖ అధికారి ప్రతినిధి గుయో జియాకున్ తాజాగా స్పందించారు. ''మాకు తెలిసినంత వరకు.. ఈ మధ్యకాలంలో అమెరికా-చైనా దేశాధినేతలిద్దరూ ఫోన్ కాల్లో మాట్లాడుకోలేదు. అంతేగాక.. టారిఫ్ల అంశంపై ఇరు దేశాల మధ్య ఎలాంటి చర్చలు గానీ, సంప్రదింపులు గానీ జరగడం లేదు'' అని జియాకున్ స్పష్టం చేశారు.

అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చైనాపై టారిఫ్ల కొరడా విసురుతున్న ట్రంప్.. బీజింగ్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై సుంకాన్ని 145శాతానికి పెంచిన సంగతి తెలిసిందే. దీనికి ప్రతిగా చైనా కూడా అగ్రరాజ్య ఉత్పత్తులపై 125శాతం టారిఫ్లు ప్రకటించింది. దీంతో ఇరు దేశాల మధ్య వాణిజ్య విభేదాలు భగ్గుమన్నాయి.

## లోకాయుక్త ప్రమాణ స్వీకారం



హైదరాబాద్, ఏప్రిల్ 28: రాష్ట్ర లోకాయుక్త, ఉప లోకాయుక్త ప్రమాణ స్వీకారం చేశారు. లోకాయుక్తగా జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డి, ఉప లోకాయుక్తగా బీఎస్ జగ్జీవన్ కుమార్ తో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం చేయించారు. కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, షబ్బీర్ అలీ, వేం నరేందర్ రెడ్డి, ఉన్నతాధికారులు, తదితరులు హాజరయ్యారు.

## కేసీఆర్‌కు అహంకారం తగ్గలే

హైదరాబాద్, ఏప్రిల్ 28(మనంబ్యూరో): రాష్ట్రంలో అధికారం కోల్పోయినా కెసిఆర్ కు ఇంకా అహంకారం తగ్గలేదని, కడుపునిండా విషం నింపుకొని మంచి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నట్లు రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిప్పులు చెరిగారు. భూ భారతి కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం శాకారం టిజిఆర్ గార్డెన్స్ లో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ తో కలిసి ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించిన దేవత సోనియా గాంధీకి సాష్టాంగ ప్రణామం చేసిన కెసిఆర్ కాలం తిరగబడి ప్రజలు బుద్ధి చెప్పడంతో కాంగ్రెస్ పార్టీని విలన్ గా చూపిస్తున్నట్లు ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఖజానాను నిండా ముంచిన ఆయన కనీసం గ్రామస్థాయి సర్పంచులకు కూడా బిల్లు ఇవ్వకపోగా, తప్పును తమపై నెట్టుతున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నియంతలా వ్యవహరించిన కేసీఆర్ సొంత ఎమ్మెల్యేలకు కూడా కలిసేందుకు ఒప్పుకోని ఆయన సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటని నిలదీశారు. రైతులు ఆత్మగౌరవంతో బ్రతికేందికే భూభారతి చట్టం తేగా, తమ అక్రమాలు బయటపడతాయనే వారు గగ్గోలు పెడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా రూ 2 లక్షల రుణమాఫీ చేసినందుకా...? మహిళలు ఉచిత ప్రయాణం చేస్తున్నందుకా...? రూ 500 లకే గ్యాస్ సిలిండర్ అందజేస్తున్నందుకా...? పేదలకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ ఇస్తున్నందుకా...? నీ ఏడుపులు పెడబబ్బలు అంటూ కెసిఆర్ ను ఆయన ప్రశ్నించారు.

# సహనం కోల్పోయిన సిద్ధరామయ్య.. పోలీసు అధికారిపై దురుసు ప్రవర్తన

ఢిల్లీ, ఏప్రిల్ 28: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మరో వివాదంలో చిక్కుకున్నారు. పాక్తో యుద్ధం వద్దంటూ చేసిన వ్యాఖ్యలతో ఇటీవల వార్తలకెక్కిన ఆయన.. తాజాగా ఓ పోలీసు అధికారిపై దురుసుగా ప్రవర్తించి మరోసారి వార్తల్లో నిలిచారు. తాను ప్రసంగించబోయే సభా ప్రాంగణం వద్ద గందరగోళం ఏర్పడడంతో సహనం కోల్పోయిన ఆయన.. పోలీసు అధికారిపై చేయి చేసుకోబోయారు. దీంతో సిద్ధరామయ్య చర్యను ప్రతిపక్షాలు తప్పుబడుతున్నాయి. బెళగావిలో సోమవారం జరిగిన బహిరంగ సభలో సిద్ధరామయ్య పాల్గొన్నారు. తాను ప్రసంగించబోయే సమయంలో ప్రాంగణంలో భాజపా మహిళా మోర్చా సభ్యులు నల్ల జెండాలతో సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు. తన ప్రసంగానికి ఆటంకం కలిగిస్తుండటంతో సభా బాధ్యతలను చూస్తున్న పోలీసు అధికారి ఏఎస్పీ భరమణిని పిలిచి సీఎం మందలించారు. ఈ క్రమంలోనే సహనం కోల్పోయి చేయి ఎత్తి.. అంతలోనే వెనక్కి తగ్గారు.

పహల్గాం దాడి ఘటనపై గీత దాటొద్దు: నేతలకు కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాలు ఈ ఘటనకు సంబంధించిన వీడియో జేడీఎస్ ఎక్స్లో పోస్టు చేసింది. పోలీసు అధికారితో సీఎం వ్యవహరించిన తీరును తప్పుబట్టింది. ''మీ అధికారి కేవలం ఐదేళ్లే. ప్రభుత్వ అధికారి 60 ఏళ్లు పాటు సేవలందిస్తారు. అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదని గుర్తుంచుకోండి'' అంటూ పోస్ట్ చేసింది. పోలీసు అధికారి పట్ల దురుసుగా వ్యవహరించినందుకు ఆయనకు క్షమాపణ చెప్పాలని భాజపా డిమాండ్ చేసింది. పాకిస్థాన్తో యుద్ధం వద్దంటూ శనివారం సిద్ధ రామయ్య చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంతో దానిపై ఆదివారం వివరణ ఇచ్చారు. యుద్ధమే వద్దని తాను అనలేదన్నారు. యుద్ధం కన్నా ముందు నిఘాను బలోపేతం చేసుకోవాలని, ఉగ్రవాదులను నిర్మూలించాలని మాత్రమే సూచించానని గుర్తు చేశారు.

## కేసు నుంచి తప్పించేందుకు లంచం

- ఓ కేసు నుంచి తప్పించేందుకు, ఫోన్ ఇచ్చేందుకు లంచం డిమాండ్
- ఇప్పటికే రూ. 2 లక్షలు తీసుకున్నట్లు ఆరోపణ

హైదరాబాద్, ఏప్రిల్ 28, మనం ప్రతినిధి: మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్సై ఎం. పరుశురాం లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఒక కేసులో ఫిర్యాదుదారుడికి అనుకూలంగా వ్యవహరించేందుకు ఆయన లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. పూర్తి వివరాల్లోకి వెళితే, శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తిని తప్పించేందుకు ప్రయత్నించారు. ఆ వ్యక్తిని కేసు నుంచి తప్పించడంతో పాటు, సీజ్ చేసిన అతని మొబైల్ ఫోన్ను తిరిగి ఇచ్చేందుకు గాను భారీ మొత్తంలో లంచం డిమాండ్ చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే ఫిర్యాదుదారు నుంచి రూ. 2 లక్షలు తీసుకున్నారు. అదనంగా మరో రూ. 22,000 ఇవ్వాలని ఫిర్యాదుదారుడిని డిమాండ్ చేశారు.

## విశాఖను ఆర్థిక రాజధానిగా, తిరుపతిని ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దుతాం: చంద్రబాబు


అమరావతి: అమరావతి అందరిదని.. రాష్ట్రానికి ఆత్మ వంటిదని సీఎం చంద్రబాబు అన్నారు. కూటమి నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. రాజధాని పునఃనిర్మాణ పనులతో అభివద్ధికి మళ్లీ ఊపిరి లభించిందన్నారు. సభకు తరలివచ్చే ప్రజలకు అసౌకర్యం కలగకూడదని చెప్పారు. అమరావతి రాజధాని తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. అన్ని ప్రాంతాలను సమానంగా అభివద్ధి చేస్తామన్నారు. ప్రజలను తప్పుదారి పట్టించే వ్యతిరేక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాజధానిలో రైతులను భాగస్వాములను చేస్తున్నట్లు చంద్రబాబు వివరించారు. ''ఎమ్మెల్యేలు, మంత్రులు బాధ్యత తీసుకొని వ్యతిరేక శక్తుల కుట్రలు తిప్పికొట్టాలి. త్వరలోనే 42 నియోజకవర్గాల్లో ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు శ్రీకారం చుడతాం. రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కూడా చేపడతాం. విశాఖను ఆర్థిక రాజధానిగా, తిరుపతిని ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దుతాం'' అని చంద్రబాబు తెలిపారు.

# విశాఖను ఆర్థిక రాజధానిగా, తిరుపతిని ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దుతాం

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలకు అసౌకర్యం కలగకూడదని చెప్పారు. అమరావతి రాజధాని తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. అన్ని ప్రాంతాలను సమానంగా అభివద్ధి చేస్తామన్నారు. ప్రజలను తప్పుదారి పట్టించే వ్యతిరేక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాజధానిలో రైతులను భాగస్వాములను చేస్తున్నట్లు చంద్రబాబు వివరించారు.

''ఎమ్మెల్యేలు, మంత్రులు బాధ్యత తీసుకొని వ్యతిరేక శక్తుల కుట్రలు తిప్పికొట్టాలి. త్వరలోనే 42 నియోజకవర్గాల్లో ఇండస్ట్రియల్ పార్కుల




ఏర్పాటుకు శ్రీకారం చుడతాం. రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కూడా చేపడతాం. విశాఖను ఆర్థిక రాజధానిగా, తిరుపతిని ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దుతాం'' అని చంద్రబాబు తెలిపారు.

# భారత్‌పై విషం కక్కుతున్న పాక్ యూట్యూబ్ చానెళ్లు

(మొదటి పేజీ తరువాయి)

విదేశాంగ మంత్రిత్వశాఖ పర్యవేక్షించనున్నదని అధికారులు తెలిపారు. కేంద్రం నిషేధించిన పాక్ యూట్యూబ్ చానెళ్లు డాన్ న్యూస్, ఇర్షాద్ భట్టి, సమా టివి, ఎఆర్‌వై న్యూస్, బిఒఎల న్యూస్, రఫ్తార్, ది పాకిస్తాన్ రెఫరెన్స్, జియో న్యూస్, సమా స్పోర్ట్, జిఎన్ఎన్, ఉజెయిన్ క్రికెట్, ఉమర్ చీమా ఎక్స్‌క్లూజివ్, ఆస్మా షిరాజి, మునీబ్ ఫారూఖ్, సునో న్యూస్, రజీ నామా. 'జమ్మూ కాశ్మీర్‌లో పహల్గామ్ ఉగ్ర దాడి ఘటన నేపథ్యంలో భారత్‌పైన, దాని సైన్యం, భద్రతా సంస్థలపైన రెచ్చగొట్టే, మతపరంగా సున్నితమైన అంశాలను. అసత్య, తప్పుదోవ పట్టించే కథనాలను ప్రసారం చేస్తున్నందుకు పాకిస్తానీ యూట్యూబ్ చానెళ్లను హోమ్ మంత్రిత్వశాఖ సిఫార్సులపై కేంద్ర ప్రభుత్వం నిషేధించింది' అని అధికారులు వివరించారు. పహల్గామ్‌లో ఇటీవలి భీకర ఉగ్ర దాడికి సంబంధించి ప్రముఖ అంతర్జాతీయ వార్తా సంస్థ బిబిసి ప్రచురించిన ఒక కథనంపై భారత ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ దాడిని 'తీవ్రవాదుల దాడి'గా అభివర్ణించడాన్ని కేంద్రం ఆక్షేపిస్తూ, బిబిసి పక్షపాత ధోరణిని ప్రదర్శిస్తోందని ఆరోపించింది. విదేశాంగ శాఖ ఈ మేరకు బిబిసి భారత్ విభాగం అధిపతి జాకీ మార్టిన్‌కు లేఖ రాసింది. 'కాశ్మీర్‌లో దాడి తరువాత భారతీయులకు వీసాలనే పాకిస్తాన్ రద్దు చేసింది' అనే శీర్షికతో బిబిసి ప్రచురించిన కథనంలో పహల్గామ్ ఘటనను ఉగ్రవాద చర్యగా పేర్కొనడానికి బదులు 'మిలిటెంట్ దాడి' అని ప్రస్తావించడంపై కేంద్ర ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇది వాస్తవాలను వక్రీకరించడమేనని, బాధితుల పట్ల అగౌరవాన్ని సూచిస్తుందని కేంద్రం తన లేఖలో పేర్కొన్నది. ఉగ్ర దాడి తీవ్రతను తగ్గించి చూపే యత్నం చేశారని ప్రభుత్వం విమర్శించింది. వాస్తవాలను పరిగణనలోకి తీసుకోవాలని బిబిసికి సూచిస్తూ, ఈ నెల 22న పహల్గామ్‌లో జరిగిన దాడికి సంబంధించిన పూర్తి వివరాలను కూడా విదేశాంగ శాఖ తన లేఖతో పాటు- పంపింది. 'ఉగ్రవాదులను తీవ్రవాదులుగా పేర్కొనడంపై బిబిసికి ఒక లేఖ పంపడమైంది. ఎంఇఎ విదేశీ ప్రచార విభాగం బిబిసి వార్త పంపే తీరును పర్యవేక్షించనున్నది' అని అధికారి ఒకరు తెలియజేశారు.

# రాజధాని పనుల పునఃప్రారంభ కార్యక్రమం.. రైతులకు ఆహ్వానం పలికిన చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణం రాష్ట్ర అభివద్ధిలో కీలక అడుగు అవుతుందని సీఎం అన్నారు. రాజధాని రైతుల త్యాగం కారణంగానే నేడు ప్రపంచస్థాయి రాజధాని నిర్మాణం చేసుకుంటున్నామని, ఎప్పటికీ రైతుల మంచి మనసును రాష్ట్ర ప్రజలు గుర్తుంచుకుంటారని అన్నారు. రాజధానిలో జరిగే ప్రతి కార్యక్రమం, పనుల్లో భాగస్వామ్యం కావాలని రాజధాని గ్రామాల రైతులను సీఎం చంద్రబాబు ఆహ్వానించారు. రాజధాని పరిధిలోని వివిధ గ్రామాల రైతులు ఉండవల్లిలోని నివాసంలో ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై రైతులతో సీఎం చర్చించారు. అమరావతి రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వం తిరిగి కేటాయించే ప్లాట్లకు బ్యాంకుల ద్వారా రుణం పొందేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



# 30న శ్రీవారి సేవ జూన్ నెల కోటా ఆన్లైన్లో విడుదల

- శ్రీవారి సేవ స్వచ్ఛంద సేవ జూన్ నెల ఆన్లైన్ కోటాను ఏప్రిల్ 30న టీటీడీ విడుదల
- జనరల్ శ్రీవారి సేవ (తిరుమల మరియు తిరుపతి) – ఉదయం 11:00 గంటలకు
- నవనీత సేవ (మహిళలకు మాత్రమే) – మధ్యాహ్నం 12:00 గంటలకు
- పరకామణి సేవ (పురుషులకు మాత్రమే) – మధ్యాహ్నం 1:00 గంటలకు
- గ్రూప్ లీడర్ సేవ (కొత్తగా ప్రారంభించిన సేవ) – మధ్యాహ్నం 2:00 గంటలకు



**తిరుమల,ఏప్రిల్ 28 మనం న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు శ్రీవారి సేవ యొక్క నాణ్యతను మెరుగుపరిచి భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో టీటీడీ అధికారులు సత్యసాయి సేవా సంస్థ (పుట్టపర్తి), ఇషా ఫౌండేషన్ (కోయంబత్తూర్), ఆర్ట్ ఆఫ్ లివింగ్ (బెంగళూరు) వంటి ప్రఖ్యాత సంస్థలను సందర్శించి అధ్యయనం చేశారు.

ఈ అధ్యయనం ఆధారంగా శ్రీవారి సేవలో కొన్ని ముఖ్యమైన మార్పులను టీటీడీ తీసుకొచ్చింది. ఈ మార్పులు ఏప్రిల్ 30న కొత్తగా రూపొందించిన అప్లికేషన్ ద్వారా అమలులోకి రానున్నాయి.

ముఖ్యాంశాలు

ఇకపై ''గ్రూప్ లీడర్స్'' సీనియర్ సేవకులు గత రెండు సంవత్సరాలుగా పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులు సేవలో పాల్గొంటున్నారు. వయస్సు 45 సంవత్సరాలు నుంచి 70 సంవత్సరాల మధ్య ఉన్న వారు నమోదు కావచ్చు. ఇప్పుడు వీరిని 'గ్రూప్ లీడర్స్' అని పిలుస్తారు. వీరు 15 రోజుల, ఒక నెల లేదా మూడు నెలల వ్యవధిలో సేవ చేయడానికి ఆన్లైన్లో ఎంపిక చేసుకోవచ్చు.

గ్రూప్ లీడర్స్ బాధ్యతలు

ఈ గ్రూప్ లీడర్స్ శ్రీవారి సేవకుల పనిని పర్యవేక్షించడం, సేవకు వారి హాజరు తీసుకోవడం, మరియు ప్రతి ఒక్క సేవకుని/సేవకురాలి పనితీరును మూల్యాంకనం చేయడం వంటి బాధ్యతలు నిర్వహిస్తారు.

పరకామణి సేవలో జనరల్ పురుష సేవకులకు అవకాశం

కనీసం పదో తరగతి విద్యార్హత కలిగిన పురుషులకు పరకామణి సేవలో పాల్గొనేందుకు అవకాశం కల్పించాలని టీటీడీ నిర్ణయించింది. ఈ మేరకు ఆన్ లైన్ ద్వారా పరకామణి సేవను బుక్ చేసుకోవచ్చని తెలియజేయడమైనది.....

# కోనపురెడ్డిపల్లి వద్ద రోడ్డు ప్రమాదం ఐదుగురు దుర్మరణం..



**తిరుపతి, ఏప్రిల్ 28 మనం న్యూస్ :** తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం కోనాపురెడ్డిపల్లి వద్ద రోడ్డు ప్రమాదం సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ముందర ప్రయాణిస్తున్న లారీని వెనకనుంచి కారు ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు సంఘటన స్థలం వద్ద ఐదుగురు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది.మృతి చెందిన వారిలో ఇద్దరు పురుషులు,ఇద్దరు స్త్రీలు,ఒక బాలుడు ఉన్నారు.విషయం తెలుసుకున్న పాకాల పోలీసు సంఘటన స్థలానికి వెళ్లి,పరిశీలించి సహాయ చర్యలు చేపడుతున్నారు.

# శ్రీసిటీని సందర్శించిన జపాన్ రాయబారి

- జపాన్ పరిశ్రమలకు అత్యంత అనువైన కేంద్రం గా కితాబు




**శ్రీసిటీ, ఏప్రిల్ 28 మనం న్యూస్ :** భారత్ లోని జపాన్ రాయబారి ఒనో కెయిచి సోమవారం శ్రీసిటీని సందర్శించారు. గత నవంబర్ లో పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం ఇది ఆయన మొట్టమొదటి శ్రీసిటీ పర్యటన. చెన్నైలోని జపాన్ కాన్సుల్ జనరల్ తకహషి మునియో, ఇతర అధికారులతో కలిసి పర్యటనకు విచ్చేయగ, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వారికి సాదర స్వాగతం పలికారు.

తొలిసారి శ్రీసిటీ సందర్శనే అజెండాగా జపాన్ రాయబారి ఇక్కడ పర్యటనకు రావడం తమకు గర్వంగా ఉందని ఈ సందర్భంగా డా. సన్నారెడ్డి వ్యాఖ్యానించారు. రాయబారికి శ్రీసిటీ ప్రగతిని వివరిస్తూ, 31 దేశాలకు చెందిన 235 కంపెనీలకు నిలయమైన శ్రీసిటీ, దేశంలోని ప్రముఖ పారిశ్రామిక కేంద్రాల్లో ఒకటిగా పేర్కొన్నారు. జపనీస్ సంస్థలకు భారతదేశంలో రెండవ అతిపెద్ద పెట్టుబడి గమ్యస్థానంగా ఆవిర్భవించిందన్నారు. భారీ కంపెనీలతో పాటు పలు అనుబంధ పరిశ్రమలతో శ్రీసిటీలోని బలమైన పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను ప్రధానంగా ఆయన దృష్టికి తెచ్చారు. పరిశ్రమ, విద్య, సుస్థిరత మూలస్తంభాలుగా అభివృద్ధి నమూనాను పెంపొందించడంలో శ్రీసిటీ నిబద్ధతను వెల్లడించారు.

శ్రీసిటీ అభివృద్ధి, వ్యాపార అవకాశాలకు సంబంధించిన వివిధ అంశాలపై ఆయన చర్చలు జరిపారు. జపాన్ పెట్టుబడులను ప్రోత్సహించడంలో కీలక పాత్ర వహించడంతో పాటు ఇండో-జపాన్ ఆర్థిక సంబంధాలను ముందుకు తీసుకెళ్లడంలో శ్రీసిటీ చేస్తున్న చురుకైన ప్రయత్నాలను ఆయన ప్రశంసించారు. జపాన్ లోని హిరోషిమా, టొయామా, ఎహైమ్ ప్రాంతాల వ్యాపార ప్రతినిధులు ఇటీవలి శ్రీసిటీ సందర్శనలను ఉటంకిస్తూ, జపనీస్ వ్యాపారవేత్తలకు శ్రీసిటీ అత్యంత అనువైన గమ్యస్థానంగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. జపాన్ పెట్టుబడిదారులకు శ్రీసిటీ వ్యాపార అనుకూలతలను సిఫారసు చేస్తానన్నారు. శ్రీసిటీలోని వివిధ జపనీస్ కంపెనీలకు చెందిన ఉన్నతాధికారులతో లంచ్ సమావేశంలో పాల్గొన్నారు. శ్రీసిటీ వ్యాపారానుకూల వాతావరణం, యాజమాన్య సహకారం పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన కంపెనీల ప్రతినిధులు, తమ అభిప్రాయాలను, ఆలోచనలను ఆయనతో పంచుకున్నారు. తదనంతరం స్థానిక డైకిన్, యూనిచార్మ్ పరిశ్రమలను సందర్శించి, అక్కడ ఉత్పత్తులు ఇతర కార్యకలాపాలను పరిశీలించారు. జపాన్ పెట్టుబడులకు శ్రీసిటీ అత్యంత ప్రాధాన్య గమ్యస్థానంగా ఎదుగుతోందన్న అంశాన్ని రాయబారి సందర్శన మరింత బలపరుస్తుంది. స్థానిక జపాన్ కంపెనీలు వ్యక్తపరచిన అనుకూల భావన, భారత్-జపాన్ సంబంధాలను మరింత బలోపేతం చేసి, శ్రీసిటీలో పెట్టుబడులకు కొత్త అవకాశాలను సృష్టిస్తుంది.

# విద్యార్థులలో ఏకాగ్రత అవసరం

- రామకృష్ణ మిషన్ సమ్మర్ క్యాంప్ సంస్కార శిబిరం 2025 ప్రారంభోత్సవం లో డీఎస్పీ బాలిరెడ్డి



**తిరుపతి, ఏప్రిల్ 28 మనం న్యూస్ :** తిరుపతి రామకృష్ణ మిషన్ ఆశ్రమం నిర్వహించిన సంస్కార శిబిరం 2025 సమ్మర్ క్యాంపు సోమవారం వివేకానంద సభంగనలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రెడ్ శాండర్స్ టాస్క్ ఫోర్స్ డిఎస్పీ జి. బాలిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో ఏకాగ్రత అవసరం అని, దానికి యోగా చేయాల్సి ఉంటుందని అన్నారు. వేసవి సెలవుల్లో శిక్షణ కార్యక్రమాల వల్ల వ్యక్తిత్వ వికాసం పొందవచ్చునని తెలిపారు. వీటి ద్వారా కొన్ని సమస్యలను తమకు తాముగా పరిష్కరించుకునే విజ్ఞానం పెంచుకోవచ్చునని అన్నారు. ఏది జరిగినా మన మంచికే అనే స్వభావాన్ని కలిగి ఉండాలని చెబుతూ నీతి కథలను ఉదహరించారు. భారతీయ విద్యాభవన్ శ్రీవేంకటేశ్వర విద్యాలయం డైరెక్టర్ డాక్టర్ ఎన్. సత్యనారాయణ రాజు మాట్లాడుతూ ఈ శిబిరాలకు హాజరైన ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థాయికి వెళ్లారని అన్నారు. విద్యార్థులకు ఉత్తమ విలువలు అందించాలని రామకృష్ణ మిషన్ ప్రయత్నిస్తోందని కొనియాడారు. రామకృష్ణ మిషన్ పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంచుకోవాలని చెప్పారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి సుకృతానంద జి మహరాజ్ మాట్లాడుతూ మిషన్ ను 1897 మే 1న ప్రారంభించారని తెలిపారు. స్వామి వివేకానంద యువతకు స్ఫూర్తిని కలుగ జేశారని తెలిపారు.2015 నుంచి వేసవి శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భారత దేశం గురు స్థానంలో ఉండాలని స్వామి వివేకానంద చెప్పినట్టు గుర్తు చేశారు. వేదాలలో మన సంస్కృతి గురించి ఉందని అన్నారు. ఏకాగ్రత ద్వారా లక్ష్యాలను సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ స్వామీజీ లు, వేసవి శిబిరంలో పాల్గొనే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కుప్పం మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన సెల్వరాజ్

- శుభాకాంక్షలు తెలియజేసిన చిత్తూరు ఎంపీ

**కుప్పం ఏప్రిల్ 28 మనం న్యూస్ :** కుప్పం మున్సిపల్ చైర్మన్ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో చైర్మన్ గా ఎన్నికైన సెల్వరాజ్ కు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు.. సోమవారం ఢిల్లీ నుంచి శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ కోసం పనిచేసే వారికి



తెలుగు దేశం పార్టీ సముచిత స్థానం కల్పించి, గౌరవిస్తుంది అనడానికి ఇదో నిదర్శనం అన్నారుబీసీ వర్గానికి చెందిన సెల్వరాజ్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ అధికారుల సమన్వయంతో.. కుప్పం పట్టణ అభివృద్ధికి కృషి చేసిప్రజా సంక్షేమం కోరి కూటమి ప్రభుత్వం అమలుపరుస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , . ఆయన పై ఉంచిన నమ్మకాన్ని వమ్ము కానివ్వకుండా.. ప్రజలకు సేవలందించి, మున్సిపల్ చైర్మన్ పదవికి వన్నె తీసుకురావాలన్నారు.

# తిరుపతి లో 150 సోలార్ కెమెరాలు ఏర్పాటు

- జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు




**తిరుపతి, ఏప్రిల్ 28 మనం న్యూస్ :** తిరుపతిలోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం లో మీడియా సమావేశంలో జిల్లా ఎస్పి వి. హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ సోలార్ కెమెరాలు సౌర శక్తితో పనిచేస్తాయని, ఇవి పర్యావరణానికి అనుకూలంగా ఉండటంతో పాటు చాలా అడ్వాన్స్ ఫీచర్స్ కలిగి ఆడియో మరియు వీడియో ఉంటుందన్నారు. సోలార్ కెమెరాలు విద్యుత్ అంతరాయం ఉండదన్నారు. సౌర శక్తితో పని చేస్తాయని, విద్యుత్తు లేని ప్రాంతాల్లో కూడా ఈ కెమెరాలు ఏర్పాటు చేసుకునే సౌకర్యంగా ఉంటుంది. వైర్లెస్ కనెక్టివిటీతో ఉంటుందని, స్మార్ట్ ఫోనులో మనం ఎక్కడ ఉన్న పర్యవేక్షించవచ్చునన్నారు. ఇది మొబైల్ సిమ్ కార్డు ఆధారంగా పనిచేస్తుందన్నారు. ప్రధానంగా తిరుమలలో శాంతిభద్రతల దృష్ట్యా 20 సోలార్ కెమెరాలు కూడా ఏర్పాటు చేస్తున్నమన్నారు. అంతేకాకుండా తిరుపతి, చంద్రగిరి ఇతర ముఖ్య ప్రాంతాల్లో అత్యాధునిక టెక్నాలజీ కలిగిన సోలార్ సిసి కెమెరా అమర్చేందుకు ఎర్పాట్లు చేస్తున్నమన్నారు. ఇప్పటికే జిల్లా లోని వివిధ ప్రదేశాలలో బ్లాక్ స్పాట్స్ గుర్తించామన్నారు.

సోలార్ కెమెరాలు అమర్చడం ద్వారా కొంతవరకు అకతాయల, అల్లరి మూకలకు చెక్ పెట్టవచ్చున్నారు. గరుడ వారిది పై బ్లాక్ స్పాట్స్ గుర్తించి సోలార్ సిసి కెమెరాను ఏర్పాటు చేస్తాము. అనుకోని సంఘటనలు జరిగినప్పుడు సోలార్ సిసి కెమెరాలు మనకు ఎంతగానో ఉపయోగపడుతుంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని దేవాలయాలలో పూర్తి స్థాయి లో సెక్యూరిటీ ఏర్పాటు చేశాము. పోలీసు సిబ్బంది వెళ్లని ప్రదేశం కూడా డ్రోన్ కెమెరాతో వెళ్ళి గాలిస్తున్నాం. ఇలా చేయడం ద్వారా మెన్ పవర్ సేవ్ అవుతుంది. డ్రోన్ కెమెరాలతో గడిచిన కాలంలో గంజాయి స్థావరాలతో పాటు నాటుసారాయి స్థావరాలపై దాడులు చేసి కొంత మందిని అరెస్ట్ చేశామన్నారు. హోం స్టే కు సంబంధించిన లిస్ట్ మా వద్ద ఉంది. ప్రతి రోజు హోం స్టేలను మా సిబ్బంది చెక్ చేస్తున్నాము. హోం స్టే లో ఎదైన వివాదాలు జరిగితే అలాంటి వాటి పై యాక్షన్ సిరియస్ గా ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారి పై కఠినమైన చర్యలు తీసుకుంటాము. ఈ కార్యక్రమంలో. రావిమనోహరచారి అదనపు ఎస్పీ, సాదిక్ ఆలీ సీఐ ఎస్బి, వినోద్ కుమార్ సీ.ఐ. సైబర్ క్రైమ్స్, ఈశ్వర్ సీఐ కమాండ్ కంట్రోల్ రమణారెడ్డి ఆర్ఐ లు పాల్గొన్నారు.

# తిరుపతి రైల్వే స్టేషన్‌లో విస్తృత తనిఖీలు

**తిరుపతి, ఏప్రిల్ 28 మనం న్యూస్ :** పహల్గామ్లో ఇటీవల జరిగిన ఉగ్రవాద దాడులను పరిగణనలోకి తీసుకుని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శ్రీమతి హర్షిత, డి ఎస్ ఆర్ పి/రేణిగుంట, శ్రీ రాజగోపాల్ రెడ్డి, అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ వారి ఆధ్వర్యంలో ప్రభుత్వ రైల్వే పోలీస్ మరియు రైల్వే భద్రత దళం సంయుక్తంగా కలిసి తిరుపతి రైల్వే స్టేషన్లో డాగ్ స్క్వాడ్ సహాయంతో విస్తృత తనిఖీలు చేయడం జరిగింది. ఈ ఆపరేషన్లో భాగంగా, ప్రయాణికులలో బలమైన భద్రతా భావాన్ని పెంపొందించడానికి ఎం. సందీప్ కుమార్, ఆర్పిఎఫ్ ఇన్స్పెక్టర్ అశీర్వాదం, ఇన్స్పెక్టర్ ఆఫ్ రైల్వే పోలీస్ వారు వారి సిబ్బందితో ప్లాట్ఫారమ్లపై మార్చ్ ఫాస్ట్ ను నిర్వహించారు.

ఈ బృందం హ్యాండ్-హెల్ మెటల్ డిటెక్టర్లు ఉపయోగించి ప్రయాణికులు మరియు వారి లగేజీలను తనిఖీలు చేశారు. డాగ్ వాయు ప్రత్యేకంగా ప్రేలేడు పదార్థాలు, గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాలను గుర్తించుటలో శిక్షణ కలిగి ఉంది. దీని సహాయంతో పార్సల్ ఆఫీస్, ప్లాట్ ఫారం మరియు రైళ్లలో భద్రత తనిఖీలను నిర్వహించారు. ప్రయాణికులు వారి సామాగ్రి అపహరణ కాకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ప్రయాణ సమయంలో ఏదైనా సహాయం కోసం ప్రయాణీకులకు రైల్వే హెల్ప్లైన్ నంబర్ 139 గురించి కూడా సమాచారం అందించారు.

# ఐదుగురు మృతి చెందిన ఘటనపై ముఖ్యమంత్రి దిగ్భ్రాంతి



**పాకాల, ఏప్రిల్ 28 మనం న్యూస్ :** తిరుపతి జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సిఎంఓ ఆదేశాల మేరకు హుటాహుటిన ప్రమాద స్థలానికి వెళ్లి జిల్లా ఎస్పీ హర్ష వర్ధన్ రాజు తో కలిసి ప్రమాద తీరును పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. స్విమ్స్ ఆసుపత్రి నందు చికిత్స పొందుతున్న క్షతగాత్రులను సందర్శించి మెరుగైన వైద్య చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ వైద్యాధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని క్షతగాత్రులకు ధైర్యం చెప్పారు.

# ఇందిరమ్మ ఇండ్లకు వెరిఫికేషన్ త్వరగా పూర్తి చేయాలి

- అర్హుల జాబితా ప్రదర్శనకు సిద్ధం చేయాలి

ములుగు, ఏప్రిల్ 28 (మనంప్రతినిధి)ః ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికకు వెరిఫికేషన్ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికకు నియమితులైన మండల స్థాయి వెరిఫికేషన్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెరిఫికేషన్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి మండలంలో నలుగురు అధికారులను వెరిఫికేషన్ ఆఫీసర్లుగా నియమించడం జరిగిందన్నారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికకు ఇప్పటివరకు ఇందిరమ్మ కమిటీ సభ్యులతోపాటు ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు పరిశీలించారని, ఇప్పుడు మండల స్థాయిలో వెరిఫికేషన్ ఆఫీసర్లు పరిశీలిస్తారని అన్నారు. పంచాయతీ కార్యదర్శులు సమర్పించిన వివరాలు రాష్ట్రస్థాయిలో పరిశీలనలో ఉన్నాయన్నారు. మూడు కేటగిరీల లిస్టులను ఇందిరమ్మ కమిటీ సభ్యులు, అధికారులు అర్హుల జాబితాను పరిశీలిస్తారని అన్నారు. వారి వివరాలను నమోదు చేయాలన్నారు. ఈ పథకానికి రేషన్ కార్డు తప్పనిసరి కాదు అని, దీనిపై ప్రభుత్వ మార్గదర్శకాలు ఇంకా రాలేదన్నారు. లబ్ధిదారులు బీపీఎల్ అయి ఉంటే చాలునని అన్నారు. లబ్ధిదారుల ఎంపికలో వెరిఫికేషన్ అధికారులు ప్రభుత్వమార్గదర్శకాలను పాటించాలన్నారు. వెరిఫికేషన్ అధికారులు వెరిఫికేషన్ లిస్టు లో ఉన్న వాటి వివరాలను నమోదు చేయాలన్నారు. ఏవైనా సందేహాలు ఉన్నట్లయితే రిమార్క్స్ కాలమ్ లో నమోదు చేయాలన్నారు. వెరిఫికేషన్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలన్నారు. వెరిఫికేషన్ అధికారులు ఏవైన సందేహాలు ఉన్నట్లయితే ఎంపీడీవో, హౌసింగ్ పీడీల ద్వారా అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. వెరిఫికేషన్ కోసం క్షేత్రస్థాయికి వెళ్ళినప్పుడుచుట్టుపక్కల వారిని కూడా అర్హులా కాదా అనేది విచారించాలని, వివరాలు అన్నీ కూడా సరిగా నమోదు చేయాలన్నారు. వెరిఫికేషన్ లో ఎలాంటి తప్పులు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. వెరిఫికేషన్ ప్రక్రియను అధికారులు ప్రభుత్వ మార్గ నిర్దేశాల ప్రకారం నిబద్ధతతో చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు పథకానికి అర్హులైన అత్యంత నిరుపేదలు, అసలు ఇల్లు లేని వారిని ఎంపిక చేయాలన్నారు.ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని అన్నారు. వచ్చిన దరఖాస్తులను మూడు కేటగిరిలు (లిస్టు లు)గా విభజించడం జరిగిందన్నారు. ఇందులో ఎల్-1 కేటగిరిలో ఇంటి స్థలం ఉన్న వారిని, ఎల్-2 కేటగిరిలో ఇంటి స్థలం, ఇల్లు లేని వారు, ఎల్-3 కేటగిరిలో అర్హతలు లేని వారి గా విభజించినట్లు పేర్కొన్నారు. దరఖాస్తుదారుల అర్హతలు పరిశీలించి ఇందిరమ్మ ఇండ్లు పథకానికి తుది జాబితాను ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయిన అనంతరం అర్హుల జాబితాను గ్రామపంచాయతీ కార్యాలయాలలో ప్రదర్శించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు పథకానికి అత్యంత నిరుపేదలను మొదటి దశలో ఎంపిక చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు పథకానికి లబ్ధిదారు ఎంపిక ప్రక్రియలో భాగంగా వెరిఫికేషన్ ను సంబంధిత అధికారులు పారదర్శకంగా నిర్వహించాలన్నారు.ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పి డి సూర్య నారాయణ, ఏ పి డి వెంకట నారాయణ, ఎంపీడీవోలు, ఎంపి ఓ లు, గ్రామ పంచాయితి ప్రత్యేక అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఈ డి ఎం దేవేందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబుని పాలనతో ప్రజాస్వామ్య వాదుల్లో ఆందోళన

- కుప్పంలో ఆరుగురు కౌన్సిలర్లు ఉన్న టీడీపీ..
- 15 మంది బలంతో విజయం సాధించింది
- ఒక్కొక్కరికి రూ. 50 లక్షలు వెచ్చించి వైయస్సార్సీపీ సభ్యులను లోబర్చుకున్నార్రు
- మాజీ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్రెడ్డి ధ్వజం

**తిరుపతి, ఏప్రిల్ 28 మనం న్యూస్ :** ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే తాను అవతవరించినట్టు ప్రచారం చేసుకునే చంద్రబాబు, సరిగ్గా తాను ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పంలోనే విషపు నాగులాగా మారి ప్రజాస్వామ్యాన్ని కాటువేశాడు. కుప్పం మున్సిపాలిటీలో కేవలం ఆరుగురు కౌన్సిలర్లే ఉన్న టీడీపీ, చైర్మన్ ఎన్నికల్లో 15 మంది సభ్యుల బలంతో చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకోవడం చూస్తుంటే ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేయడమే. ఏడాది పదవీ కాలం కూడా లేని చైర్మన్ పీఠం కోసం వైయస్సార్సీపీ నుంచి ఫ్యాన్ గుర్తుపై గెలిచిన 9 మంది కౌన్సిలర్లను భయపెట్టి, ప్రలోభాలకు గురిచేసి



తమవైపునకు తిప్పుకున్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా వైయస్సార్సీపీ కౌన్సిలర్లకు ఒక్కొక్కరికి రూ. 50 లక్షలు ఎరవేసి అధికార మదం ప్రదర్శించారు. కుప్పం మున్సిపాలిటీలో విజయం సాధించినంత మాత్రాన రాష్ట్ర రాజకీయాల్లో వచ్చే మార్పులేవీ ఉండవని తెలిసి కూడా ఇలాంటి అనైతిక విధానాలకు పాల్పడుతున్న చంద్రబాబును చూసి ప్రజాస్వామ్యవాదులు ఆలోచనలో పడ్డారు.

గడిచిన మూడు నెలలుగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న స్థానిక సంస్థల చైర్మన్, వైస్ చైర్మన్, మేయర్, డిప్యూటీ మేయర్ పీఠాలను కైవసం చేసుకునేందుకు కూటమి నాయకులు అడ్డదారులు తొక్కుతున్నారు. తిరుపతి, విశాఖ మేయర్ ఎన్నికల్లో గెలవడం కోసం కూటమి నాయకులు చేసిన విధ్వంసాన్ని రాష్ట్రమంతా చూసి నివ్వెరపోయింది. అధికారం కోసం ఎన్ని అడ్డదారులైనా తొక్కడానికి, ఎంతకైనా దిగజారడానికి తాము సిద్ధమన్నట్టు కూటమి నాయకులు వ్యవహరిస్తున్నారు.

గతంలో వైయస్సార్సీపీ హయాంలో ఒక్కసీటుతో తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని టీడీపీ కైవసం చేసుకుంటే ప్రజాస్వామ్యాన్ని గౌరవించాం కాబట్టే టీడీపీ అభ్యర్థి చైర్మన్ కాగలిగారు. ఆనాడే మా నాయకులు వైయస్ జగన్ ఆదేశించి ఉంటే జేసీ ప్రభాకర్రెడ్డి చైర్మన్ కాగలిగేవారేనా? ప్రజాస్వామ్య విలువలు కాపాడేలా గడిచిన ఐదేళ్లు వైయస్సార్సీపీ పాలన సాగితే, చంద్రబాబు సారథ్యంలో కూటమి పాలన వచ్చాక అడుగడుగునా ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుతున్నారు. ప్రజలతో ఎన్నుకోబడిన నాయకులకు విలువ లేకుండా అడ్డదారిలో అధికారాన్ని చేజిక్కించుకోవడం చూసి ప్రజాస్వామ్యవాదులు ఆందోళన చెందుతున్నారు. ప్రజలంతా చంద్రబాబు పాపపు పాలన చూస్తున్నారు. రాబోయే రోజుల్లో ప్రజల ఆగ్రహానికి గురికాకతప్పదు.

## నేత పువ్వులు



ఇక్కడ పువ్వులున్నయి
రంగు రంగుల పువ్వులు
మగ్గం గుంజలకు పూచిన పువ్వులు
కలలు పేనుకున్న బ్రతుకు పూదోటలో
మెతుకు ముద్దల కొరకు
నోళ్ళు తెరచి ఎదురుచూస్తున్నయి
కడుపు లోపలి ఖాళీ పద్యం దోసిళ్ళకెత్తుకుని
కళా పోషకులకు స్వాగతం పలుకుతున్నయి

అక్కడక్కడో అప్పుడెప్పుడో
అంగట్లో రత్నాలు ఆరబోసుకున్నట్టు
నేత పువ్వులు
కంట్లో వొత్తులు వెలిగించుకుని చూస్తున్నయి
ఇంత మందిలో
అసలు మనిషి కానరాక
చేదు చేదు ఉపవాస గీతాలు ఆలపిస్తున్నయి
పావురాళ్ళకు ఇన్ని గింజలు చల్లి పోయినట్టు
కాసులు ఇచ్చి పువ్వులు కోసుకు పోయే
దేవతల కొరకు
ఒంటికాలు తపస్సు చేస్తున్నయి

చుట్టూ చీకటిలా
గడ్డ కట్టుకుపోయిన నిట్టూర్పు అంతా
మంచు ముక్కలా కరిగిపోయే
గోరంత వేకువ ఎక్కడున్నదో
తోటమాలికి ఊపిరాడుతలేదు
ఏ కలాల కందని దుఃఖ గీతం
ఏ కరుణశ్రీ పాడని పుష్ప విలాపం
తీగకు వేల్లాడుతున్నది

మెత్తగానో గరుకుగానో
పువ్వులు తెంచుకుపొమ్మని
కన్నీటి కాలువలు కడుతున్నయి
ఆకాశానికి నిచ్చెన వేసిన కాలం
శిధిల స్వప్నాల కింద నలిగిపోతున్నది
పట్టుచీర కట్టు పుత్తడిబొమ్మల రాక కోసం
తోటంతా
విరగబూసి విరగబూసి ఎదురుచూస్తున్నది.

**- గజ్జెల రామకృష్ణ**
8977412795

# ఒత్తిడిలో ఆత్మహత్యలు..!





మన దేశ భవిష్యత్తు యువతరం చేతిలోనే ఉంది. ఏ దేశ ప్రగతికైనా సమర్థ యువ మానవ వనరులే కీలకం. అలా వారు వర్తమానమనే అపురూప బహుమానాన్ని సంపూర్ణంగా సద్వినియోగం చేసుకోవాలి. ఒక్కసారి కోల్పోతే తిరిగి తెచ్చుకోలేని శక్తి సామర్థ్యాలు, కాలం విలువ తెలిసుకొని యువత మసులుకోవాలి. ప్రపంచంలో దేన్నైనా కొనగలం ఒక్క సమయాన్ని తప్ప, అందుకే యువతరం ఆధునిక టెక్నాలజీ మాయలో స్మార్ట్ ఫోన్లో కాలం వృధా చేయడమో, డ్రగ్స్ కో, మద్యానికో, ఈజీ మనీకోసం బెట్టింగ్ జూదం లాంటి వ్యసనాలకు బానిస కారాదు!. విద్యార్థులకు, యువతకు చదువు సంపద ఒక్కటే జీవితం కాదు. నీకంటూ ఏదో ఒక నైపుణ్యం కలిగి ఉంటావు. అదేమిటో తెలుసుకో ఆత్మవిశ్వాసంతో ఆచరించిన మరుక్షణం నీకు తిరగుండదని గట్టిగా నమ్మండి. ఈ రోజుల్లో సామాజిక స్పృహ, మానవీయ విలువల్ని పెంచే మంచి వ్యక్తుల అవసరం ఎంతో ఉంది. మీ శక్తి సామర్థ్యాలేమిటో తెలుసుకొని లక్ష్యాన్ని ముద్దాడాలి. ప్రభుత్వాలు వారిలో నైపుణ్యాలు పెంపొందించి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ, స్వయం ఉపాధితో ఇంకొందరికి జీవనోపాధి కల్పించాలి. తద్వారా మెరుగైన ఆర్థిక ప్రగతికి దోహద పడాలి.

అలా నైతిక విలువలతో సామాజిక బాధ్యతతో మెలిగేలా తయారు చేయాలి. ఇతరుల నమ్మకాలను, విలువలను గౌరవించినప్పుడే సమాజం శాంతి, సౌభ్రాతృత్వంతో ప్రగతి పథంలో పయనించడానికి సాధ్యమౌతుంది. ఇలాంటి వేళ యువతరం ఎదుర్కొనే సమస్యలను పరిశీలిద్దాం.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక చుట్టు ముడుతున్న ఆర్థిక సమస్యలు, కుటుంబ సమస్యలు, సామాజిక ఆర్థిక పరిస్థితులు తదితర కారణాలతో యువత మానసిక ఆందోళన, ఒత్తిడికి గురవుతోందని 'యంగ్ లైవ్స్ ఇండియా' అధ్యయనం వెల్లడించింది.

గత నాలుగైదేళ్లలో పురుషులతో పోలిస్తే మహిళల్లో ఈ మానసిక అనారోగ్య లక్షణాలు పెరుగుతున్నాయని తెలిపింది. సర్వేలో పాల్గొన్న యువతలో దాదాపు 59 శాతం మంది, ఏదో ఒక సమస్యతో ఒత్తిడిని ఎదుర్కొన్నట్లు వివరించింది. తెలుగు రాష్ట్రాల్లోని యువతలో ఆరోగ్యం, పోషకాహారం, మానసిక ఆరోగ్యంపై ఈ అధ్యయనం నిర్వహించారు. నివేదికలో వెల్లడైన అంశాలు..ఏపీతో పోలిస్తే తెలంగాణ యువతలో ఒత్తిడి, ఆందోళన, నిరాశ లక్షణాలు ఎక్కువగా ఉన్నాయి. ఉన్నత వర్గాలతో పోలిస్తే ఎస్సీ,ఎస్టీ,బీసీల్లో ఈ పరిస్థితులు ఎక్కువ.పేదరికం, తల్లిదండ్రుల్లో తక్కువ అక్షరాస్యత, వెనుకబడిన అణగారిన వర్గాల కుటుంబాల్లోని యువత ఎత్తుకు తగిన బరువు లేక బలహీనంగా ఉన్నారు. ఆహార అభద్రత పరిస్థితులు ఎక్కువగా ఎదుర్కొంటున్నారు. చదువుకున్న,ధనిక కుటుంబాల్లోని యువతలో ఊబకాయం లక్షణాలు ఉన్నాయి. పోషకాహార సమస్యలున్న కుటుంబాలు 38శాతం ఉన్నట్టు వెల్లడయింది. ఎత్తుకు తగిన బరువు లేని యువత, అదే సమయంలో అధిక బరువుతో బాధపడుతున్న యువత సమానంగా ఉన్నారు. యువతలో మధుమేహం, గుండె సంబంధిత తదితర నాన్ కమ్యూనికబుల్ వ్యాధుల కారణంగా మరణాల రేటు ఆందోళన కలిగిస్తుంది. 22 ఏళ్ల యువతలో 21 శాతం మంది, 29 ఏళ్ల యువతలో 13 శాతం మంది ఊబకాయం, అధిక బరువు సమస్యలతో బాధపడుతున్నారు. ఈ పరిస్థితులు యువతలో హృద్రోగ సమస్యల పెరుగుదలకు కారణమవుతున్నాయి. తెలంగాణలో హృద్రోగ సంబంధిత ముప్పు 22 ఏళ్ల యువతలో 7.94 శాతం ఉంటే, 29 ఏళ్ల యువతలో 15.51 శాతం ఉంది. ఏపీలో 22 ఏళ్ల యువతలో 9.22 శాతం ఉంటే, 29 ఏళ్ల యువతలో 22.73శాతం ఉంది. మానసిక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారు 2021లో ప్రతి లక్ష మందిలో 1974 మంది ఉంటే.. ఇప్పుడు మరో 11 శాతం పెరిగినట్లు నివేదిక వెల్లడించింది. సర్వేలో పాల్గొన్న యువతలో దాదాపు 15శాతం మందిలో స్వల్ప, మధ్య స్థాయి మానసిక ఆందోళన, నిరాశ లక్షణాలు కనిపించాయి. వీరిలో ప్రతి 10 మందిలో 6గురు వివిధ సమస్యలతో ఒత్తిడికి గురవుతున్నట్లు అధ్యయనం గుర్తించింది.

మానసిక ఆరోగ్యం మధ్య స్థాయి ఒత్తిడి- 22ఏళ్ల యువతలో ఏపీలో 54.13శాతం ఉంటే తెలంగాణలో 67.97, 29ఏళ్ల యువతలో ఏపీలో 51.85, తెలంగాణలో 71.34, మానసిక ఆందోళన 22 ఏళ్ల యువతలో ఏపీలో 5.96, తెలంగాణలో 14.84, 29 ఏళ్ల యువతలో ఏపీలో 10.93, తెలంగాణలో 20.52, నిరాశ, నిస్పృహ 22 ఏళ్ల యువత ఏపీలో 7.14, తెలంగాణలో 14.53, 29 ఏళ్ల యువతలో ఏపీలో 7.04, తెలంగాణలో 17.26 శాతం మానసిక ఒత్తిడిలో యువతరం ఉన్నారని యంగ్ లైవ్స్ ఇండియా అధ్యయనం వెల్లడిం చింది.

రెండు తెలుగు రాష్ట్రాల్లో అలా ఉంటే...మన దేశంలో మానసిక సమస్యలతో బలవన్మరణాలకు పాల్పడుతున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. 2020-22 మధ్య కాలంలో ఇలా ఆత్మహత్యలు చేసుకున్న వారి సంఖ్య ఏకంగా 44శాతం పెరిగిందని జాతీయ నేర రికార్డుల బ్యూరో(ఎన్ సీ ఆర్ బీ) తెలిపింది. ఇలా మానసిక ఆరోగ్యం బాగాలేక ప్రాణాలు తీసుకుంటున్న ప్రతి ఐదుగురిలో ముగ్గురు 18-45 సంవత్సరాల మధ్య వయస్కులు కావడమే గమనార్హం. మానసిక అనారోగ్యంతో ఏటా పెరుగుతున్న బలవన్మరణాలు 18-45 సంవత్సరాల వయసులోనే అధికం. ఇంకా వెలుగులోకి రాని మహిళల ఆత్మహత్యలు ఉంటున్నట్లు తెలుస్తోంది. నానాటికి ఆత్మహత్య రేటు పెరుగుతోంది..మన దేశంలో ఆత్మహత్య చేసుకున్న ప్రతి ముగ్గురిలో ఇద్దరు18- 45 సంవత్సరాల మధ్య వయస్కులేనని ఎన్ సీ ఆర్ బీ నివేదిక తెలిపింది. 2018 తో పోలిస్తే 2022లో దేశంలో ఆత్మహత్య చేసుకున్న వారి సంఖ్య 27శాతం పెరిగింది. దీనితో పాటే ప్రతి లక్ష జనాభాకు ఆత్మహత్య రేటు కూడా పెరిగింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూటీవో) ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఏటా 7.2 లక్షల మందికి పైగా ఆత్మహత్య చేసుకుంటున్నారు.15 -29 సంవత్సరాల మధ్య వయస్సున్న వారిలో మరణాలకు మూడో అతి పెద్ద కారణం 'ఆత్మహత్యే'. ప్రపంచంలో చోటు చేసుకుంటున్న ఆత్మహత్యలలో 73శాతం పేద, ఓ మోస్తరు ఆదాయం కలిగిన దేశాల్లో జరుగుతున్నవే. ఈ పరిణామాల దృష్ట్యా 2017లో కేంద్ర ప్రభుత్వం మానసిక ఆరోగ్య రక్షణ చట్టాన్ని రూపొందించింది. ఎలాంటి వివక్షకు తావు లేకుండా నాణ్యమైన మానసిక ఆరోగ్య సేవలు ప్రజలందరికీ అందుబాటులో ఉంచడం దీని ప్రధాన లక్ష్యం.. అయితే ఇది సరిగా అమలు కావడం లేదు, పైగా ఆత్మహత్య చేసుకున్న వారి వివరాలు సేకరించడం, దానిని వర్గీకరించడంలో కూడా పరిమితులు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా మహిళల ఆత్మహత్యలు చాలా వరకు వెలుగులోకి రావడం లేదు.

ప్రపంచ దేశాల్లోనే యువ జనాభా ఎక్కువ కలిగిన దేశం మనది. ఆ యువశక్తికి మానసిక ఆరోగ్యం, శారీరక ఆరోగ్యం చాలా ముఖ్యం. అది చేజారితే యవతరం ఏది సాధించలేదు. యువతరం ప్రతిభ, నైపుణ్యాలు ఇంటిపట్టునో, ఫోన్లో కాలం వృధా చేస్తూనో, వ్యసనాలకో బానిసై పోతే..! మన దేశ భవిష్యత్తుకు పుట్టగతులుండవు.

ఆత్మహత్యలన్నీ ఈ లోకం చేసే హత్యలే... దీనికి ప్రభుత్వాల బాధ్యత లేదా! కాదా? యువ శక్తిని ఇలా నిర్వీర్యం చేస్తూ,గాలికి వదిలేస్తే ఎలా? యువత మానసిక ఒత్తిడికి లోనై ఆత్మహత్యలకు పాల్పడకుండా ప్రభుత్వాలు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ దేశ ప్రగతికి తోడ్పడేలా పాలన విధానాలు ఉండాలి. నష్టం జరిగిన తర్వాత సలహా ఇవ్వడం అంటే! మరణానంతరం మందు ఇవ్వడం లాంటిదే. ఈ విశ్వంలో విలువ కట్టలేనిది ఏదైనా ఉందంటే అది ప్రాణం ఒక్కటే. కావున యువత నిరాశ, నిస్పృహకు లోను కాకూడదు. మిమ్మల్ని అవహేళన చేసిన వాళ్లే మీ గురించి గొప్పగా చెప్పుకునే రోజులు వస్తాయని గట్టిగా నమ్మాలి.. మీ జీవితాన్ని చక్కదిద్దుకోవాలి. యువత పట్ల చులకన భావన విడనాడి వారిని నవజీవన నిర్మాతలుగా తీర్చి దిద్దడానికి ప్రభుత్వ చేయూత నివ్వాలి. యువత సన్మార్గంలో పయనించడానికి ప్రభుత్వాల బాధ్యత ఎంతైనా ఉంది. ప్రభుత్వం ఈసురోమని ఉంటే దేశం ఏమాత్రం ముందడుగు వేయలేదు. యువతలో ఉన్న సర్వం సహా నైపుణ్యాలను వెలికితీసి వారిని దేశాభివృద్ధిలో భాగస్వామ్యం చేయడానికి వీలైనని సదుపాయాలు కల్పించాలి.అప్పుడే యువత వ్యక్తిగతంగా తెలివిడి చెంది దేశాభివృద్ధికి ఇతోధికంగా తోడ్పడతాడనే వాస్తవాన్ని ప్రభుత్వాలు గమనించాలి.

**- మేకిరి దామోదర్**
9573666650

# సమాజ వికాసానికి ఆయుధం 'పుస్తకం'




**'పుస్తకాలు దీపాల వంటివి వాటి వెలుతురు మనోమాలిన్యమనే చీకటిని తొలగిస్తుంది'**
**- డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్**

పుస్తకం హస్త భూషణం అన్నది ఆర్యోక్తి... ఎంతో మంది కలలకు, ఉజ్వల జీవితాలకు ఆధారం. పుస్తక పఠనం మనిషిలో విజ్ఞానాన్నిపెంచుతుంది. పుస్తకం సామాన్యుని ఆయుధం. చిరిగిన చొక్కా అయినా తొడుక్కో కానీ ఒక మంచి పుస్తకం కొనుక్కో అన్నారు కందుకూరి వీరేశలింగం పంతులు. ఆ మాటలు నేటికి పుస్తక ప్రియుల చెవుల్లో మార్మోగుతూనే ఉంటాయి. ఒక మంచి పుస్తకం వేయి మంది మిత్రులతో సమానమని అన్నారు మరో మహానుభావుడు. ఎందరో మహానుభావులు పుస్తక పఠనం విశిష్టతను ప్రయోజనాలను తెలియ చేశారు. పుస్తకం ఒంటరి తనంలో మంచి హితవరి.. ఓ మంచి స్నేహి తుడు..గురువులా హితబోధ చేస్తుంది. మానసిక శారీరక అలసటను ఒక మంచి పుస్తకం తొలగింస్తుందనడంలో ఎంతమాత్రం అతిశయోక్తి లేదు. బాధపడే వారిని ఓదార్చుతుంది. అందుకే పుస్తకం అనితరమైన ఆయుధంగా నేస్తంగా అన్ని తరాలను అలరిస్తోంది. జీవితంలో విజ్ఞానాన్ని సంపాదించుకొని ఉన్నత స్థాయికి ఎదగడానికి దోహదపడే సాధనం పుస్తకం. పుస్తకం మనోవికాసానికి మార్గదర్శి. పుస్తక ప్రచురణ ప్రారంభమయిన తర్వాత మానవ జీవన గమనంలో విప్ల వాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. ఉదయం టీ తాగితే వచ్చే హాయి పుస్తక పఠనంతో అంతే హాయి వస్తుంది అంటారు పుస్తక ప్రియులు. పుస్తక ప్రియులకు అన్నిటిని మరిపించే విజ్ఞాన, వినోద, వికాస భాండాగారం పుస్తకం. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగిన వారి విజయ రహస్యం పుస్తకం. వారు ఎదిన క్రమంలో అనుభవాలు ఎదురుకొన్న కష్టాలను అక్షర రూపంలో అందించి ధైర్యాన్ని ఇస్తుంది పుస్తకం. పుస్తక పఠనం వల్ల సామాజిక అవగాహన సమస్యల పరిష్కార శక్తి యుక్తి ఇనుమడిస్తుంది. సమయానుకూల స్పందనను మెరుగైన ప్రజా సంబంధాల దృఢత్వంతో మానవీయ విలువలు రక్షించబడుతాయి. నా బార్య బిడ్డల కన్న పుస్తకమే నాకు ఎక్కువ నా ప్రాణం పుస్తకం అని అంబేద్కర్ అన్నారు. పుస్తకాలకు ఆయన అంత విలువ నిచ్చే వారు. ప్రస్తుతం అన్ని వయసుల వారు పుస్తకాలకు దూరమై టివి చూస్తూ, వీడియో గేమ్స్ ఆడుతూ మానవ సంబంధాలు లేకుండా ఒంటరి జీవితానికి అలవాటు పడడం శోచనీయం. ఎప్పుడు సోషల్ మీడియాలో వుంటూ కాలం గడిపే దుస్థితిలో కూరుకు పోవ డం వల్ల ఒత్తిడికి లోనవుతున్నారని అనేక అధ్యయనాలు తెలుపు తున్నాయి. పుస్తకాలను మ్యూజియంలో పెట్టుకొని చూడడం తప్ప చదవడానికి ఆసక్తి చూపడం లేదు.

**పుస్తక పఠనంవిజ్ఞాన వికాసం**

ఓ మంచి పుస్తకం చదవడంలో ఉన్న ఆనందం అనుభవంతో తెలిసివస్తుంది. పుస్తకాలు చదవడంతో మనోవికాసం కలిగి నూతన ఆలోచనలకు పురుడు పోస్తాయి. పుస్తకం అజ్ఞాన్ని తొలిగించి విజ్ఞాన్ని అందిస్తుంది. ఒంటరితనంలో స్నేహితుడిలాగా అక్కున చేర్చు కుంటుంది. బాధపడేవారిని ఓదారుస్తుంది. అలసిన మనసుకు సేద తీరుస్తుంది. అందుకే పుస్తకం పఠనం తరాల తరాల సంస్కృతిని అంది స్తుంది. మానవ నాగరికత చరిత్ర వారసత్వం జాతి ఔన్నత్యం పట్ల అవగాహనకు పుస్తక పఠనం 'వారధిగా' నిలవడం గమనార్హం. ప్రపంచ పుస్తక దినోత్సవం పురస్కరించుకొని పుస్తక పఠనం ఒక సామాజిక ఉద్యమంగా కొనసాగాల్సిన అవసరం ఉంది. మంచి పుస్తకం జీవితాన్ని మారుస్తుంది ఉన్నాయి. సమకాలీన సమాజంలో సామాజిక సాంకేతిక మార్పులు ఎన్ని వచ్చిన పుస్తక ప్రియులు పుస్తకాన్ని వదలలేదు. సినిమాలు, టివిలు 'ఇంటర్నెట్ మొబైల్' మాయలు దరి చేరినా పుస్తకం విలువ తగ్గలేదు. తగ్గదు కూడా. మనల్ని గుచ్చి గాయపరిచి ఇబ్బంది పెట్టే రచనలు చదవాలి. మంచి పుస్తకం మనలో దాగి వున్న ప్రతిభను సృజనను తట్టి లేపాలి. పుస్తక పఠనం మనలో గడ్డ కట్టిన సముద్రాన్ని గొడ్డలి లాగా పగుల కొట్టాలి' అంటాడు ప్రముఖ రచయిత కాఫ్కా.



**పుస్తక పఠనం ఆరోగ్యానికి మేలు**

'పుస్తక పఠనం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. మేధస్సు సక్రమంగా పనిచేస్తుంది. పాజిటివ్ ఆలోచనలు ప్రేరేపిస్తుంది. నెగెటివ్ దృక్ప థాన్ని అరికడుతుంది. పుస్తక పఠనం బహుళ ప్రయోజనాలను నూతన ఆలోచనలు సృజన శక్తి తాత్వికత శాస్త్రీయత విశ్లేషణ పరిశీలన పరిశోధన పరిష్కారం సామర్థ్యం నూతన ఆవిష్కరణలకు దోహద పడుతుంది. విశ్లేషణా సామర్థ్యాలను పెంపొందిస్తుంది. పుస్తక పఠనం ఒత్తిడిని తగ్గిస్తుంది. అనవసర ఆలోచనలు నియంత్రిస్తుంది. శారీరక మానసిక ఆరోగ్యం చేకూరుతుంది. ఒత్తిడి నుండి విముక్తి చెందాలంటే రాత్రి పడుకునే ముందు సాహిత్యానికి సంబందించిన పుస్తకాలు చదవడం మంచిది. శారీరక మానసిక ఆరోగ్యం సిద్ధిస్తుంది. ఏకాగ్రత చేకూరి ఒంటరి తనానాన్ని దూరం చేస్తుంది. ఎదిగే పిల్లలకు ఒక్కో వయసులో ఒక్కో తరహా పుస్తకం అవసరం. ప్రారంభంలో బొమ్మల కథలు పుస్తకాలు మొదలుపెట్టి నాగరికతలు, పరిశోధనలు, సాహస గాధలు, మహనీయుల జీవిత చరిత్రలు, శాస్త్రవేత్తల పరిశోధనలు మొదలగు అంశాల మీద అవగాహన చైతన్యం కలిగించ డానికి అవసరమయ్యే పుస్తకాలు చదివే అలవాటు జీవన విధానం లో భాగం కావాలి. ఏప్రిల్ 23వ తేదీని ప్రపంచ పుస్తక దినోత్సవం పాటించాలని 1955లో యునెస్కో ప్రకటించింది. అంతే కాకుండా ప్రపంచ పుస్తక కాపీ హక్కుల దినంగా జరుపాలని సూచించింది.

**భారత్‌లో చదువరుల సంఖ్య ఎక్కువ**

ప్రపంచంలో పుస్తకాలు చదివే (పాఠకులు) చదువరుల సంఖ్యమీద జరిపిన సర్వేలో భారతదేశంలో చదివే వారు ఎక్కువ ఉన్న ట్టు తేలింది.ఈ సర్వే పలు ఆసక్తికర విషయాలు వెల్లడించింది. భారతీయులు వారానికి సగటున 10.2 గంటలపాటు పుస్తక పఠనం చేస్తారని దశాబ్దం కింద చేసిన ఒక అధ్యయనంలో తేలింది. 2013 నాటి సర్వే ప్రకారం పుస్తక పఠనం సమయం 10.4 గంటలకు పెరి గింది. టీవీలు,సినిమాలు, ఇంటర్నెట్ వినియోగం మారుతున్న జీవన శైలి వల్ల పుస్తక పఠనంపై మోజు తగ్గలేదు. పుస్తక పఠనం చేసే వారి సంఖ్య మరింత పెరగాలని పుస్తక ప్రియులు కోరుకుంటున్నారు. ప్రస్తుత టెక్నాలజీ యుగంలో ఉరుకుల పరుగుల జీవితంలో పుస్తకపఠనం తగ్గిపోయింది. ఆన్‌లైన్‌లో చదువుతున్నారు. పుస్తకాలు పట్టుకుని పఠనం చేయడం మర్చిపోతున్నారు. అందుకే కొన్ని స్వచ్ఛంద సంస్థలు తమకు తోచినట్టుగా పుస్తక పఠనం పట్ల ప్రజల్లో ఆసక్తి కలిగించే ప్రయత్నం చేస్తున్నాయి. అందులో భాగంగా పుస్తక ప్రదర్శన పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలపై సెమినార్లు సదస్సులు వివిధ ప్రతిభ పాటవ పోటీలు నిర్వహించడం గమనార్హం.

పుస్తక ప్రదర్శనలో అనేక రకాల అంశాలకు సంబంధించిన పుస్తకాలన్నీ ఒక చోట దొరకం అనేది ఒక అందమైన అనుభవం కూడా. అలాంటి అనుభవం కూడా పుస్తక పఠనంతో సమానంగా పరిగణిస్తారు చాలా మంది పుస్తక ప్రియులు. పుస్తక ప్రదర్శనలో ఎంతో మంది పుస్తక ప్రియులు ఒకే చేరి తమ తమ భావాలను పంచుకోవడం కూడా ఒక అపురూప విషయంగా పరిగణించాలి.

**ప్రభుత్వం పౌరసమాజం**

పౌరసమాజం స్వచ్ఛంద సంస్థలు,మహిళా సంఘాలు, యువజన సంఘాలు, విద్యార్థి సంఘాలు, ఉద్యోగ సంఘాలు, గ్రంథాలయాల స్థాపనకు పూనుకోవాలి. పుస్తకాలు చదివే లక్షణం వాతావరణం ప్రజల్లో కలిగించాలి. పుస్తకాలు కొని చదివే సంస్కృతిని పెంపొం దించడం. పుస్తకాలు ప్రపంచానికి చేసిన సేవలు గుర్తు చేసుకోవడం కొత్త తరాలను పుస్తక పఠనం వైపు ఆకర్షించడం ప్రపంచ పుస్తక పఠన దినోత్సవం సందర్భంగా యునెస్కో ఆశయాలసాధన దిశగాకృషి జరగాలి. కేంద్ర,రాష్ట్ర స్థానిక ప్రభుత్వాలు పూనుకొని పౌర గ్రంథా లయాలు ఏర్పాటు చేయాలి. పాఠశాల కళాశాల స్థాయిలో లైబ్రరీలలో డిజిటల్ టెక్నాలజీ ఆధునిక సమాచార సౌకర్యాలను ఏర్పాటు చేయాలి.ఆధునిక టెక్నాలజీ ఉపయోగించి మౌలిక సదుపాయాలు కల్పించాలి. పాఠకులకు మెరుగైన సేవలు అందించాలి. మానవ వనరుల సర్వతో ముఖాబివృద్ధికి దోహదపడే బహుముఖ చర్యలు చేపట్టి విజ్ఞాన భారత్ నిర్మాణానికి పటిష్ట కార్యాచరణ ప్రణాళికతో సగ్రమైన చర్యలకు సంసిద్ధం కావాలని ఆశిద్దాం .

**- నేదునూరి కనకయ్య**
9440245771


# పాపం.. గాజ చిన్నారులు

దేశాల మధ్య వైరుద్యాలు ఉండవచ్చు కాని, మానవతా దృక్పథంతో అవి వ్యవహరించాలి. గాజలో చిన్నారులు ఆకలితో అలమటిస్తూ, ప్లేట్స్ చేతులతో పెట్టుకుని ఆక్రందనలతో ఉన్న చిత్రాలు చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది. ఇజ్రాయెల్‌కు కనికరం లేకుండా పోయింది. ఆహారం అందించే అన్ని ద్వారాలు మూసి వేసింది. పాపం చిన్నారుల ఆకలి కేకలు ఆ దేశం కళ్ళు తెరిపించ లేదు. అగ్ర రాజ్యం కూడా ఈ విషయంపై నోరు మెదక పోవటం శోచనీయం. ఆట బొమ్మగా ఇజ్రాయెల్ ఇలా ప్రవర్తించడం మంచిది కాదు. ట్రంప్ సూచించిన ఫార్ములా ఏమైందో తెలియడం లేదు. ఇజ్రాయెల్ మాత్రం పెట్రేగిపోతోంది. ఇరువురి మధ్య చర్చలు ఫలవంతం కావాలి. అవి అటు గాజ, ఇటు ఇజ్రాయెల్ ఖచ్చి తంగా పాటించాలి. లేకపోతే ఇటువంటి దుష్పరిణామాలు చోటు చేసు కుంటాయి. నిత్యావసరాలు కూడా దొరకలేని పరి స్థితి. ధరలు చుక్కల నంటుతున్నాయి. పసిపిల్ల లకు పాలు దొరకక అల్లాడి పోతున్నారు. వారు ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లి పోయి కన్ను మూస్తున్నారు. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలే వారికి ఇప్పుడు శర ణ్యం. పాలస్తీనావాసులు చాలా వరకు పస్తులే ఉంటున్నారు. ఇది వరకు టొమోటోలు దొరికేవి. ఇప్పుడు అవి భారీ ధరలతో వెక్కిరి స్తున్నాయి. దా దాపు దుకాణలు ఖాళీ అవుతున్నాయి. ఆహారం అందించే వివిధ స్వచ్ఛంద సంస్థలు కూడా నిషేధం వల్ల ఏ సహాయక కార్యక్రమాలు అందించ లేక పోతు న్నాయి. ఇజ్రాయెల్ తీరును ఐక్యరాజ్య సమితి,వివిధ దేశాలు తీవ్ర ఆక్షేపణ తెలిపినప్పటికీ ఇజ్రాయెల్‌లో మార్పు రావడం లేదు. ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ 'ఆహార సంస్థ' చొరవ తీసుకోవాలి. ఆకలితో అలమటిస్తున్న గాజలో ఎక్కడ చూసినా శవాలే కళ్ల ముందు కదలాడు తున్నాయి. వీధులన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి. పౌరుల మేలు కోరి పాలస్తీనీయులు నడచు కోవాలి. ఇజ్రాయెల్ ప్రధాని బెంజెమిన్ నెత న్యాహూ కూడా పసి పిల్లల అవస్థలు చూసి గాజలో మాములు పరుస్థితులు వచ్చేలాగా ఫల ప్రదమైన చర్చలు జరిపి...అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలి. ఇజ్రాయెల్ దాడులలో ఇప్పటి వర కు దాదాపు యాభై వేలకుపైనే మరణించి ఉం టారు. మృతులలో పసిపిల్లలు, మహిళలు ఎక్కువ గా ఉన్నారు.చాలా మంది సర్వం కోల్పోయి బిక్కు, బిక్కు మంటూ కాలం వెలిబుచ్చు తున్నారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కూడా ఇజ్రా యెల్‌కు నచ్చ జెప్పి శాంతికి చర్యలు తీసుకోవాలి. అమెరికా కాస్త కఠిన వైఖరి వ్యవహరించి పసిపిల్లల కొసం, మహిళల కొసం ఇజ్రాయెల్‌ను అడ్డు కోవాలి. క్రీస్తు బాటలో నడచి శాంతికి ప్రయత్నం చేయాలి. ప్రస్తుత పరిస్థితులలో గాజలో మార్పు రావాలి, మాములు పరిస్థితులు నెలకొనాలి. రెండిటి మధ్య సంఘీభావం అవసరం.



**- కనుమ ఎల్లారెడ్డి**
93915 23027

# మతిమరుపు మాయలో పడకండి - విటమిన్ కె లోపమే కారణం!



మనిషీ శరీరంలోని ఏదైనా అవయవం పని చేయక పోతే నొప్పి, బాధ అనిపిస్తుంది. వెంటనే ఆ అవయవం పూర్తిగా బాగు అయ్యేంత వరకు శ్రద్ద వహిస్తున్న మనిషీ, అదే ఉజ్వల మైన భవిష్యత్తును మన కళ్ల ముందుకు తీసుకు వచ్చే ప్రధానమైన అవయవం మెదడును ఎలా వాడుకోవాలో తెలియకనో ఏమో మెదడు పని తీరుపై శ్రద్ద చూపడం లేదు. మారుతున్న కాలానికి అనుగుణంగా మనిషి జీవితాలు, జీవన విధానాలలో మార్పులు, చేర్పులు చోటు చేసుకుంటున్నాయి. ప్రపంచాన్ని అరచేతి (మొబైల్ ఫోన్)లోనే వీక్షిస్తున్న మనిషికి అప్పుడప్పుడు విచిత్రమైన కష్టాలు తెచ్చిపెడుతున్నాయి. సమయానికి గుర్తుకు రాని యూజర్ ఐడీలు, పాస్‌వర్డ్‌లు, సీక్రెట్ కోడ్‌లతో మతి మరుపు వచ్చిందేమోనని అనుమానాన్ని కూడా మెదడు గుర్తు చేస్తుంది.

మన శారీరక ఆరోగ్యానికి మెదడు ఆరోగ్యానికి విటమిన్లు చాలా ముఖ్యమైనవి. అందులో విటమిన్ కె గురించి చాలా అశ్రద్ధ చేస్తూ ఉంటాం. కానీ ఇది మానసిక స్థిరత్వానికి, జ్ఞాపకశక్తికి కీలక పాత్ర పోషిస్తుంది. ఇటీవలి పరిశోధనలు విటమిన్ కె లోపం మతిమరుపు,డిమెన్షియా వంటి సమస్యలకు దారితీస్తుందని తెలియజేశాయి.

**విటమిన్ కె లోపంతో ఎదురయ్యే మానసిక సమస్యలు :** విటమిన్ కె లోపం వల్ల మతిమరుపు, అలసట, మానసిక బలహీనత, అల్జీమర్స్, డిమెన్షియా వంటి మెదడు సంబంధిత వ్యాధులు, డిప్రెషన్, ఆందోళన, నిద్రలేమి, ఒకే విషయాన్ని పదే పదే అడగడం/మరిచిపోవడం, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యంలో లోపం, భావోద్వేగ నియంత్రణలో క్షీణత లాంటి



అనేక మానసిక సమస్యలు కలిగే అవకాశం ఉంటుంది.

**విటమిన్ కె శరీరానికి చేసే ఉపయోగాలు :** విటమిన్ కె వల్ల మనిషికి, మనసుకు చాలా ఉపయోగాలు ఉన్నాయి. ఇది గాయాలనుండి రక్షణకు అవసరం. మెదడు నాడీ వ్యవస్థకు శక్తిని అందించి, మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. ఆక్సిడేటివ్ స్ట్రెస్ తగ్గించడంతో మెదడు క్షీణతను నివారి స్తుంది. మూడ్ స్టెబిలిటీ (భావోద్వేగ సంతులనం) లో కీలక పాత్ర పోషిస్తుంది.

**విటమిన్ కె లభించే ముఖ్యమైన ఆహారాలు :** విటమిన్ కె కోసం మనం ప్రతి రోజు తీసుకొనే ఆహారంలో ఆకుపచ్చ ఆకుకూరలు (పాలకూర, మునగకూర, తోటకూర), బ్రోకలీ, క్యాబేజీ, అవకాడో, గుడ్లు, పాలు, ఉల్లిపాయలు, శనగలు, పప్పు ధాన్యాలు మొదలగునవి ఉండునట్లుగా జాగ్రత్త తీసుకోవాలి.

**మానసిక ఆరోగ్య రహస్యం :** వయస్సుతో పాటు విటమిన్ కె శోషణ తక్కువగా జరుగుతుంది.

ముఖ్యంగా వృద్ధులలో మతిమరుపు, డిమెన్షియా, ఒత్తిడి సంబంధిత సమస్యలు ఎక్కువగా కనిపించడం ఇదే కారణం కావచ్చు. వయస్సు కాదు. విటమిన్ లోపమే మీ మెదడు శత్రువు. మెదడు మౌనంగా మారకముందే స్పందించండి. మతిమరుపు మొదలైతే ఇక మళ్లీ గుర్తు రాకపోవచ్చు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు మరియు సరైన పోషకాహారం తీసుకోవడం ద్వారా మానసిక స్థిరత్వాన్ని మెరుగుపర్చవచ్చు.

**మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోండి :** విటమిన్ కె ని ఎప్పుడూ నిర్లక్ష్యం చేయకండి!

**- డా. అట్ల శ్రీనివాస్ రెడ్డి**
9703935321

# ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమస్యలు పరిష్కారమయ్యేనా..?

- నిర్లక్ష్యం చేస్తున్న అధికారులు.. ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్
- సమస్య పరిష్కారానికి 90 రోజుల గడువు ఉందంటూ తహసీల్దార్ నిర్లక్ష్య సమాధానం..
- సమస్యను పరిష్కరించకుండా పరిష్కారమయ్యిందంటూ ఎండాస్మెంట్లు ఇచ్చి అర్జీని క్లోజ్ చేసిన తహసీల్దార్ ఆర్డీవో..
- తన పొలం కబ్జా అయ్యిందని వృద్ధురాలి ఆవేదన..
- కబ్జా నుండి విడిపించి తన పొలాన్ని అప్పగించాలని కలెక్టర్ కు వినతి..
- అధికారులు పట్టించుకోవడం లేదంటూ కలెక్టర్కు వృద్ధురాలు ఫిర్యాదు..



నంద్యాల ఏప్రిల్ 28మనం న్యూస్: నంద్యాల జిల్లా, నందికొట్కూరు.. ప్రజా సమస్యలను పరిష్కరించడానికి తన పొలాన్ని కబ్జాకోరాల నుండి కాపాడి.. తన పొలాన్ని తనకు అప్పగించాలని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ముందు సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వృద్ధురాలు తన ఆవేదనను వ్యక్తం చేసింది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. నా పేరు మహబూబ్ బీ భర్త అబ్బుల్ మునాఫ్ నేను నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణంలో నివాసం ఉంటున్నాను. నాకు జూపాడుబంగ్లా మండల పరిధిలోని పారుమంచాల గ్రామంలో సర్వేూ 366/2 సిఐఏ లో 5 ఎకరాల పొలం ఉన్నది. ఈ పొలాన్ని నేను సేద్యం చేసుకుంటూ జీవనం కొనాసాగిస్తున్నాను. ఈ పొలానికి సంబంధించి పట్టాదారు పాసుబుక్, ఆన్లైన్ అడంగల్, ఆర్.ఓ.ఆర్, ఉన్నాయి. కాని ప్రస్తుతం మా పక్క పొలము సర్వే నెంబర్ :- 366/2సి 2ఎ లోని పారుమంచాల గ్రామానికి చెందిన అబ్దుల్ ఖాదర్ అనే వ్యక్తికి 2.50 ఎకరాలు ఉంది, మరియు ఆర్టీసీ డ్రైవర్ అయిన మహమ్మద్ షరీఫ్ లు 2.50 ఎకరములు పొలం వారికి సర్వేూ :- 366/2సి 2ఎ లో ఉన్నది. కాని అన్యాయంగా మా సర్వే నెంబర్. :- 366/2ఛి1అ లోని దాదాపు 3 ఎకరాలు కబ్జా చేసి మేము వేసిన పంటలను చెడగొడుతూ దౌర్జన్యంగా మా పొలంలో పంటలు వేసుకుంటూ మమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈ విషయమై 11-11-224 న నంద్యాల కలెక్టర్ కార్యాలయంలో పి జి ఆర్ ఎస్ లో ( ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమస్యలు పరిష్కారమయ్యేనా..? నిర్లక్ష్యం చేస్తున్న అధికారులు.. ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్ సమస్య పరిష్కారానికి 90 రోజుల గడువు ఉందంటూ తహసీల్దార్ నిర్లక్ష్య సమాధానం.. సమస్యను పరిష్కరించకుండా పరిష్కారమయ్యిందంటూ ఎండాస్మెంట్లు ఇచ్చి అర్జీని క్లోజ్ చేసిన తహసీల్దార్ ఆర్డీవో.. తన పొలం కబ్జా అయ్యిందని వృద్ధురాలి ఆవేదన.. కబ్జా నుండి విడిపించి తన పొలాన్ని అప్పగించాలని కలెక్టర్ కు వినతి.. అధికారులు పట్టించుకోవడం లేదంటూ కలెక్టర్కు వృద్ధురాలు ఫిర్యాదు.. నంద్యాల జిల్లా, నందికొట్కూరు.. ప్రజా సమస్యలను పరిష్కరించడానికి తన పొలాన్ని కబ్జాకోరాల నుండి కాపాడి.. తన పొలాన్ని తనకు అప్పగించాలని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ముందు సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వృద్ధురాలు తన ఆవేదనను వ్యక్తం చేసింది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. నా పేరు మహబూబ్ బీ భర్త అబ్బుల్ మునాఫ్ నేను నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణంలో నివాసం ఉంటున్నాను. నాకు జూపాడుబంగ్లా మండల పరిధిలోని పారుమంచాల గ్రామంలో సర్వేూ 366/2సీఐ ఎ లో 5 ఎకరాల పొలం ఉన్నది. ఈ పొలాన్ని నేను సేద్యం చేసుకుంటూ జీవనం కొనాసాగిస్తున్నాను. ఈ పొలానికి సంబంధించి పట్టాదారు పాసుబుక్, ఆన్లైన్ అడంగల్, ఆర్.ఓ.ఆర్, ఉన్నాయి. కాని ప్రస్తుతం మా పక్క పొలము సర్వే నెంబర్ :- 366/2సి 2ఎ లోని పారుమంచాల గ్రామానికి చెందిన అబ్దుల్ ఖాదర్ అనే వ్యక్తికి 2.50 ఎకరాలు ఉంది, మరియు ఆర్టీసీ డ్రైవర్ అయిన మహమ్మద్ షరీఫ్ లు 2.50 ఎకరములు పొలం వారికి సర్వే నెంబర్ :- 366/2సి 2ఎ లో ఉన్నది. కాని అన్యాయంగా మా సర్వే నెంబర్ :- 366/2సి 1ఎ లోని దాదాపు 3 ఎకరాలు కబ్జా చేసి మేము వేసిన పంటలను చెడగొడుతూ దౌర్జన్యంగా మా పొలంలో పంటలు వేసుకుంటూ మమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈ విషయమై 11-11-224 న నంద్యాల కలెక్టర్ కార్యాలయంలో పి జి ఆర్ ఎస్ లో ( పిజిఆర్ఎస్ నంబర్ : న్ న్. డి 2024 1112320) అర్జీని సమర్పించాను . అనంతరం జూపాడుబంగ్లా తహసిల్దార్ వారిని కలిసాను. సమస్యను తాసిల్దార్ వారికి వివరించి తెలియజేశాము . పారువంచాల గ్రామంలో 10/12/24 తేదిన జరుగు రెవెన్యూ సదస్సుకు రమ్మని సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. పారుమంచాల గ్రామంలో విచారణ చేపెట్టి పక్కన పొలం రైతు మా పొలంను కబ్జా చేసినట్లు తేలినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా మీ అర్జీకి తొమ్మిది రోజుల సమయం ఉందని, ఆ సమయంలోపు మీ సమస్యకు పరిష్కారం చూపిస్తామని చెప్పారు. మా సమస్యకు పరిష్కారం చూపాలని పారుమంచాల గ్రామంలో నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో 10/12/24 న తాసిల్దార్ వారికి అర్జీని సమర్పించినాము. మీ సమస్యను గడువులోగా పరిష్కరిస్తామని చెప్పి ఎలాంటి విచారణ జరపకుండా అతని పొలం కొలతలు వేసి చూపించుకుండా, ఎవరి పొలం వారు సాగు చేసుకోండి అంటూ నిర్లక్ష్య సమాధానం చెబుతూ పొలంకు సంబంధించిన చెక్ బంది రాసి ఎండార్సుమెంటు ఇచ్చారు. మేము ఆన్లైన్ ద్వారా అర్జీనీ రీ- ఓపెన్ చేయగా ఆర్డీవో కార్యాలయానికి రెఫర్ చేసినట్లు తెలపారు. ఆర్డీఓ కార్యాలయం వారు మమ్మల్ని పిలావకుండానే మా అర్జీని పరిష్కరించినట్లు క్లోజ్ చేశారు. దీనిపై అధికారులను అడగగా సమస్యను తేల్చేశాం ఎవరి పొలం వారు చేసుకోండి అంటూ నిర్లక్ష్య సమాధానం చెబతున్నారు. నంద్యాల జిల్లా కలెక్టర్ వారు మాపై దయ ఉంచి కబ్జా చేసిన వారి నుండి మా పొలం మాకు ఇప్పించాలని మమ్మల్ని పట్టించుకోకుండా అర్జీని క్లోస్ చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము. ా ః ూ 2024

1112320) అర్జీని సమర్పించాను . అనంతరం జూపాడుబంగ్లా తహసిల్దార్ వారిని కలిసాను. సమస్యను తాసిల్దార్ వారికి వివరించి తెలియజేశాము . పారువంచాల గ్రామంలో 10/12/24 తేదిన జరుగు రెవెన్యూ సదస్సుకు రమ్మని సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. పారుమంచాల గ్రామంలో విచారణ చేపెట్టి పక్కన పొలం రైతు మా పొలంను కబ్జా చేసినట్లు తేలినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా మీ అర్జీకి తొమ్మిది రోజుల సమయం ఉందని, ఆ సమయంలోపు మీ సమస్యకు పరిష్కారం చూపిస్తామని చెప్పారు. మా సమస్యకు పరిష్కారం చూపాలని పారుమంచాల గ్రామంలో నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో 10/12/24 న తాసిల్దార్ వారికి అర్జీని సమర్పించినాము. మీ సమస్యను గడువులోగా పరిష్కరిస్తామని చెప్పి ఎలాంటి విచారణ జరపకుండా అతని పొలం కొలతలు వేసి చూపించుకుండా, ఎవరి పొలం వారు సాగు చేసుకోండి అంటూ నిర్లక్ష్య సమాధానం చెబుతూ పొలంకు సంబంధించిన చెక్ బంది రాసి ఎండార్సుమెంటు ఇచ్చారు. మేము ఆన్లైన్ ద్వారా అర్జీనీ రీ- ఓపెన్ చేయగా ఆర్డీవో కార్యాలయానికి రెఫర్ చేసినట్లు తెలపారు. ఆర్డీఓ కార్యాలయం వారు మమ్మల్ని పిలావకుండానే మా అర్జీని పరిష్కరించినట్లు క్లోజ్ చేశారు. దీనిపై అధికారులను అడగగా సమస్యను తేల్చేశాం ఎవరి పొలం వారు చేసుకోండి అంటూ నిర్లక్ష్య సమాధానం చెబతున్నారు. నంద్యాల జిల్లా కలెక్టర్ వారు మాపై దయ ఉంచి కబ్జా చేసిన వారి నుండి మా పొలం మాకు ఇప్పించాలని మమ్మల్ని పట్టించుకోకుండా అర్జీని క్లోస్ చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము.

# సీఎంకు కృతజ్ఞతలు



కర్నూలు ఏప్రిల్ 28 మనం న్యూస్: కర్నూలు జిల్లా మార్కెటింగ్ సొసైటీ ఛైర్మన్ గా తనకు అవకాశం కల్పించినందులకు తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి రాష్ట్ర విద్యాశాఖామాత్యులు నారా లోకేష్ తెలుగుదేశంపార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యదర్శి వై. నాగేశ్వరరావుయాదవ్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ రోజు వారు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి పత్రికల వారితో మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీలో తాను చేసిన శ్రమను గుర్తించిన పార్టీ అధినేత తనపై నమ్మకంతో జిల్లా స్థాయి చైర్మన్ పదవిని అప్పగించిన పార్టీ అధినేత నమ్మకాన్ని వమ్ము చేయకుండా నా యొక్క విధులను నిర్వర్తిస్తాననీ, నాయొక్క నియామకమునకు సహకరించి పార్టీకి చెందిన మంత్రులకు, పార్లమెంట్ సభ్యులకు, శాసనసభ్యులకు, శాసనమండలి సభ్యులకు పార్టీ రాష్ట్ర మరియు జిల్లా స్థాయి తెలుగుదేశంపార్టీ పెద్దలందరికి మనస్ఫూర్తిగా అలాగే కూటమి నాయకులకు తెలియజేయుచున్నాను.

# ఉపాధి వేతన దారులకు ప్రతి రోజు లక్ష పనిదినాలు కల్పించండి

- కేటాయించిన లక్ష్యాలపై ప్రత్యేక దృష్టి సారించండి
- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

నంద్యాల, ఏప్రిల్ 28మనం న్యూస్:-గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వేతన దారులకు ప్రతి రోజు లక్ష పనిదినాలు తప్పనిసరిగా కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఎపిడిలను ఆదేశించారు. సోమవారం కమాండ్ కంట్రోల్ రూమ్ లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి ఉపాధి హామీ లక్ష్యాపై జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్ లో డ్వామా పిడి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద వేతన దారులకు ప్రతి రోజు లక్ష పనిదినాలు కల్పించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సంబంధిత క్షేత్ర స్థాయి అధికారులను ఆదేశించారు. ఆత్మకూరు, నందికొట్కూరు, వెలుగోడు, పగిడ్యాల మండలాల్లో తక్కువ వేజ్ రేటు రావడం జరిగిందన్నారు. అదే విధంగా బనగానపల్లె, బేతంచెర్ల మండలాల్లో ఉపాధి లక్ష్యాల సాధనలో తక్కువ పురోగతి ఉందన్నారు. ఔకు, నందికొట్కూరు మండలాల్లో ఉపాధి వేతన దారుని సగటు కూలి అధిక శాతం సాధిస్తుంటే... కొత్తపల్లి, వెలుగోడు, పాములపాడు మండలాలు తక్కువ రేటు రావడానికి గల కారణాలు ఏంటి అని కలెక్టర్ ప్రశ్నించారు. పనులు హాజరైన ఉపాధి హామీ వేతనదారులకు నమోదు చర్యలు చేపట్టి చెల్లింపు కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కేటాయించిన లక్ష్యాలపై మూడు నెలలు కష్టపడి చేస్తే మంచి పురోగతి సాధించవచ్చని కలెక్టర్ తెలిపారు. ఫామ్ ఫాండ్స్ కు సంబంధించి 2500 మంజూరు కాగా 2008 గ్రౌండింగ్ చేయడం జరిగిందన్నారు. సంజామల, కొత్తపల్లి మండలాల్లో తక్కువ పురోగతి సాధించారని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అదే విధంగా అన్ని ఫార్మ్ పాండ్స్ ను గురువారం నాటికి పూర్తి



చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పశువుల నీటి తొట్లకు సంబంధించి 637 మంజూరు కాగా అందులో 227 మాత్రమే పూర్తి అయ్యాయని కొత్తపల్లి, ఉయ్యాలవాడ, పాములపాడు, దొర్నిపాడు మండలాల్లో తక్కువ పురోగతి సాధించారని ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పశువుల షేడ్స సంబంధించి దొర్నిపాడు, సిరివెళ్ల మండలాల్లో కూడా పురోగతి శాతం తక్కువగా ఉందని వాటిలో పురోగతి సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నీటి తొట్లు, పశువుల నీటి తొట్లు, పశువుల షేడ్స్ పై దృష్టి సారిస్తుందని వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

# 30 న పాలీసెట్ పరీక్ష కు పరీక్ష కేంద్రాలు ఏర్పాట్లు

- ప్రిన్సిపల్ శైలేంద్ర కుమార్

బేతంచెర్ల మనం న్యూస్: ఈనెల 30 న జరగనున్న పాలిసెట్-2025 ప్రవేశ పరీక్ష కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బేతంచెర్ల కోఆర్డినేటర్ మరియు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎ శైలేంద్ర కుమార్ తెలిపారు పాలిటెక్నిక్ కళాశాల ప్రధాన కేంద్రంగా బేతంచెర్ల లో సుమేధ హైస్కూల్ రీడ్ జూనియర్ కళాశాల మరియు సెంట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్ లతో పరీక్ష నిర్వహణ గురించి అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు పరీక్ష 11 ఎఎంనుండి 1పీఎం వరకు జరుగుతుందని అభ్యర్థులు 10 గంటల లోపు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు పాలీసెట్ హాల్ టికెట్ బాల్ పెన్ పెన్సిల్ తెచ్చుకోవాలని మొబైల్ ఫోన్ కాల్క్యులేటర్ స్మార్ట్ వాచ్ తదితర ఎల్కట్రానిక్ గాడ్జెట్స్ ను అనుమతించబోమని తెలిపారు అసిస్టెంట్ కోఆర్డినేటర్ హేమంత్ కుమార్ మాట్లాడుతూ ప్రవేశ పరీక్షకు బేతంచెర్ల పరిధిలో 909 అభ్యర్థులు రిజిస్టర్ చేసుకున్నారని ప్రతి పరీక్షా కేంద్రానికి ప్రత్యేకంగా పరిశీలకులను నియమించినట్లు తెలియజేశారు.




# దేశంలో తీవ్రవాదాన్ని కూకటి వేళ్ళతో పెకిలించాలి

తీవ్రవాదుల దాడి హేయమైన చర్య • భూ భారతి దేశానికే రోల్ మోడల్ • రైతులు, ప్రజలు భూ సమస్యలు పరిష్కరించేందుకే భూ భారతి చట్టం • భూ సమస్యలు లేని రాష్ట్రా గా తీర్చి దిద్దటమే లక్ష్యం • మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 28(మనంన్యూస్): తెలంగాణ ప్రజా ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి దేశానికే రోల్ మోడల్ అని అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండ సురేఖ అన్నారు. సోమవారం హత్నూర మండలం లోని మంగపూర్ గ్రామం లోని ప్రైవేటు ఫంక్షనల్లో భూభారతి అవగాహన సదస్సుకు , అటవీ,దేవాదాయ ధర్మాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, మెదక్ ఎంపీ రఘు నందన్ రావు, పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి, టీజీ ఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు లతో కలసి పాల్గొన్నారు.దేశంలో తీవ్రవాదుల దాడికి నిరసనగా రెండు నిముషాల సమయం మౌనం పాటించారు.జ్యోతి ప్రజ్వలన చేసి భూ భారతి చట్టం అవగాహన సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా భూభారతి-నూతన ఆర్వోఆర్ చట్టానికి సంబంధించిన అంశాలు, మార్గదర్శకాలపై వీడియో సందేశాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ... దేశంలో తీవ్రవాదాన్ని కూకటి వేళ్ళతో పెకిలించలన్నారు. తీవ్ర వాదుల దాడి హేయమైన చర్యగా అభివర్ణించారు. దేశంలో తీవ్రవాదాన్ని నిర్మూలించడానికి కేంద్ర ప్రభుత్వనికి తమ పార్టీ పూర్తి అండగా ఉంటుందని ఎంపీ రఘు నందన్ రావుకు తెలిపారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన భూభారతి చట్టం ప్రయోజనాలు సామాన్య ప్రజలకు చేరినప్పుడే దానికి సార్థకత ఏర్పడుతుందని అన్నారు. రైతులు, ప్రజల మేలు కోసం ఈ చట్టాన్ని తీసుకువచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. త్వరలో గ్రామ పరిపాలన అధికారులను ప్రభుత్వం నియమిస్తుందని తెలిపారు. భూ సమస్యలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలన్న లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని అన్నారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి దేశానికే రోల్ మోడల్ అని అన్నారు. భారతి చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు, పకడ్బందీగా అమలు చేయాలన్న లక్ష్యంతో జిల్లాలోని అన్ని మండలాల్లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులను





నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధరణి స్థానంలో కొత్త భూమి హక్కుల రికార్డు - భూ భారతి చట్టం అని ఈ చట్టం లో హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చెయ్యడానికి ముందు భూముల సర్వే, మ్యాప్ తయారీ ,పెండింగ్ సాదాబైనామా ధరఖాస్తుల పరిష్కారం అవకాశం ఉందన్నారు. వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్ చేసే ముందు నిర్ణీత కాలంలో విచారణ చేయాలని, భూమి హక్కులు మ్యుటేషన్ చేసి రికార్డులలో నమోదుకు, పాసు పుస్తకాలలో భూమి పటం ఏర్పాటుకు అవకాశం ఉందన్నారు.భూ సమస్యల పరిష్కారనికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ, వ్యక్తికి ఆధార్ భూమికి భూధార్ కార్డుల జారీ చేస్తున్నట్లు చట్టంలో ఉందని తెలిపారు. ఇంటి స్థలాలకు, ఆబాది,వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డు, రైతులకు ఉచిత న్యాయ సహాయం ,గ్రామ రెవిన్యూ రికార్డుల నిర్వహణ, మోసపూరితంగా హక్కుల రికార్డులు మార్చి ఎవరైన ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వర్ఫ్ భూములకు పట్టాలు పొందితే రద్దు చేసే అధికారన్నీ కూడా పొందుపరిచారని,రికార్డులో తప్పుల సవరణకు ,హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు కూడా అవకాశం ఉందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎంపీ రఘు నందన్ రావు మాట్లాడుతూ భూ భారతి చట్టం లో రైతులకు చట్టాలపై అవగాహన కల్పించి, భూ సమస్యలు లేకుండా చూడాలన్నారు. దేశంలో 5 కోట్ల కేసులు పెండింగ్ లో ఉన్నాయని వాటిలో 3 కోట్ల వరకు భూ సంబంధిత కేసులే ఉన్నాయన్నారు. భూ రికార్డులు డిజిటల్ గా మార్చాలని ,భూ భూధార్ లాంటివి గతంలో కేంద్ర ప్రభుత్వా నిర్ణయించిన కూడా అప్పటి ప్రభుత్వాలు అమలు చేయలేదన్నారు.గ్రామాల్లో ఉన్న గ్రామ కంఠం,అభది భూముల సర్వే జరగాలన్నారు. టి జి ఐ ఐ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ భూ భారతి చట్టం ఎంతో అనుభవజ్ఞులతో తయారు చేశారని, ధరణిలో అనేక లోపాలు ఉన్నాయని, గతంలో పేద రైతులను న్యాయస్థానాల చుట్టూ తింపారని అని అన్నారు. ప్రజా పాలన అనంతరం రైతు సంక్షేమ కార్యక్రమాలు అనేకం జరిగాయన్నారు. రుణమాఫీ ,ఉచిత విద్యుత్ ,ఫ్రీ బస్ , 500 కే గ్యాస్ సిలిండర్, సన్నాళ్లకు బోనస్ ఇలాంటివి అమలు చేశారన్నారు. యువతకు అనేక ఉద్యోగ అవకాశాలు కల్పించాలని తెలియజేశారు. జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ రైతులు, ప్రతి ఒక్కరికీ నూతన చట్టం భూభారతి, దానిలోని అంశాల పట్ల సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. జిల్లా స్థాయిలో రైతులకు, ప్రజలకు లీగల్ సర్వీస్ అథారిటీ ద్వారా న్యాయపరమైన సేవలు అందిస్తామన్నారు.

ఇంతకు ముందు ఉన్న ధరణిలో కోల్పోయిన హక్కులు, కొత్త చట్టంలో ఎలాంటి హక్కులపై అవగాహన కల్పించేందుకు ఈ సదస్సులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సదస్సుకు హాజరైన ప్రతి ఒక్కరు తమ తమ గ్రామాల్లో నూతనంగా తీసుకువచ్చిన భూభారతి చట్టం గురించి ప్రజలకు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, మెదక్ జిల్లా గ్రంధాలయ చైర్మన్ సుహాసిని రెడ్డి,అదనపు కలెక్టర్ మాధురి,ఆర్ డి ఓ రవీందర్ రెడ్డి , తాసిల్దార్ పర్వీన్ షేక్, ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు .

# 30,985 ప్రజా ఫిర్యాదులను పరిష్కరించాం



- రీఓపెన్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించండి
- పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంపై అర్జీదారుల అభిప్రాయ సేకరణ వేగవంతం చేయండి
- పిజిఆర్ఎస్ కు 200 దరఖాస్తులు
- జిల్లా కలెక్టర్ శ రాజకుమారి గణియా

నంద్యాల, ఏప్రిల్ 28మనం న్యూస్:- ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి స్వీకరించిన 32,796 దరఖాస్తులలో ఇప్పటివరకు 30,985 ఫిర్యాదులను పరిష్కరించామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా నలుమూలాల నుంచి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ తో పాటు ఇన్చార్జి జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, డిఆర్వో రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ప్రజల నుండి స్వీకరించిన విజ్ఞప్తులలో ఇప్పటివరకు 30,985 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. రీఓపెన్ అయిన 59 దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టి వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధించిన అధికారులను ఆదేశించారు. పెండింగ్లో ఉన్న 1811 దరఖాస్తులను వితిన్ ఎస్ఎల్ఏ లోగా పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక పరిష్కార స్థితిపై కొత్త ట్యాగ్ విధానాన్ని రూపొందించడం జరిగిందని తెలిపారు. సమస్యను పూర్తిగా పరిష్కరించి అర్జీదారుడు లబ్ధి పొందినప్పుడు ఇజ్టీజ్ఞీ ఛ్ఛుజజ్ఞీఛీ అనే టాగ్ ను, ఫిర్యాదును పరిష్కరించలేని సందర్భాల్లో ఇఛ్ట' ఛ్ఛీ్ఛ ను ఎంచుకొని అందుకు తగ్గ కారణాలను తప్పనిసరిగా పేర్కొవాలన్నారు. పరిష్కరించిన ఫిర్యాదుల అర్జీదారుల అభిప్రాయ సేకరణ వేగవంతం చేసి వంద శాతం పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. గ్రామ, వార్డు సచివాలయ సర్వేలలో భాగంగా పెండింగ్ లో ఉన్న 157మిస్సింగ్ ఎంప్లాయిస్ డేటా, సిటిజన్ ఈ-కేవైసీ, 637 వర్క్ ఫ్రం హోం డేటా ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే పెండింగ్లో ఉన్న మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ 24శాతం మంది మాత్రమే మొబైల్ యాప్ వినియోగిస్తున్నారని ఇంటింటికి వెళ్లి మొబైల్ ఉన్న ప్రతి ఒక్కరి చేత నంబర్ సేవ్ చేయించి హాయ్ అని మెసేజ్ పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

# భూ భారతి చట్టం మండల స్థాయి అవగాహన సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే



**కామారెడ్డి, ఏప్రిల్ 28 ( మనం ప్రతినిధి):** జుక్కల్ నియోజకవర్గంలోని నిజాంసాగర్ మండల తహసీల్దార్ కార్యాలయం నందు రెవెన్యూ శాఖ నిర్వహించిన తెలంగాణ భూ భారతి చట్టం (భూమి హక్కుల రికార్డు-2025) మండల స్థాయి అవగాహన సదస్సులో ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.,

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు తీసుకొచ్చిన 'భూ భారతి'ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఎమ్మెల్యే గారు రెవెన్యూ యంత్రాంగాన్ని కోరారు.. తెలంగాణలో వివాద రహిత భూ విధానాలు ఉండాలన్నదే ప్రభుత్వ ప్రయత్నమని స్పష్టం చేశారు. ఆధార్ తరహాలో భవిష్యత్లో భూమికి సంబంధించి సర్వే చేసి కొలతలు, హద్దుల వంటి సమగ్రమైన వివరాలతో 'భూధార్' తీసుకొస్తామని వివరించారు. ప్రజా పోరాటాల నుంచి పుట్టుకొచ్చిన రెవెన్యూ చట్టాలు, ప్రజల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయం అని అన్నారు. ఈ చట్టాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత రెవెన్యూ అధికారులపైనే ఉందని చెప్పారు. ఎంతో మంది అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని, ప్రజల నుంచి వచ్చిన సమాచారాన్ని క్రోడీకరించి భూములకు సంబంధించి శాశ్వత పరిష్కారం చూపించాలన్న ఉద్దేశంతో భూ భారతి చట్టం తెచ్చామని తెలిపారు. ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి విజ్ఞప్తులను తీసుకుని వాటిని పరిష్కరిస్తున్నామని అన్నారు. తెలంగాణ రైతులు, ప్రజల పాలిట శాపంగా మారిన ధరణి వ్యవస్థను బంగాళాఖాతంలోకి విసిరేశామని, దాని స్థానంలో నూతనంగా తీసుకొచ్చిన భూ భారతి చట్టం, భూ భారతి పోర్టల్ రైతులకు చుట్టంలా సకల సమస్యలకు పరిష్కార వేదికగా ఉంటుందని తెలిపారు. సాదాబైనామాలకు ధరణిలో ఎలాంటి అవకాశం లేదని,భూ భారతిలో దీనిని పరిష్కరించనున్నామని, తొమ్మిది లక్షల 26 వేల సాదాబైనామా దరఖాస్తులు ఉన్నాయని,వాటిలో న్యాయమైన వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. ఈ అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్, రెవెన్యూ అధికారులు, మండల నాయకులు, రైతులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ జాతీయ పురస్కారాన్ని అందుకున్న డాక్టర్ బాలు



**కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 28 ( మనం న్యూస్):** వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ జాతీయ స్థాయి పురస్కారాన్ని గోదావరిఖని లో కామారెడ్డి రక్తదాతల సమూహ వ్యవస్థాపకుడు, ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా అవార్డ్ గ్రహీత డాక్టర్ బాలు మాట్లాడుతూ., కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలో తలసేమియా వ్యాధితో 200 మంది బాధపడుతున్నారని వారు చికిత్స నిమిత్తమై హైదరాబాద్, నిజామాబాద్ కు వెళ్లడం జరుగుతుందని, వారి ప్రాణాలను కాపాడాలంటే 15 రోజులకు ఒక యూనిట్ రక్తం అవసరం అని, వారి ప్రాణాలను కాపాడడం కోసం మెగా రక్తదాన శిబిరాలులను ఏర్పాటు చేసి 2500 యూనిట్ల రక్తాన్ని సేకరించి అందజేసినందుకు గాను ఈ పురస్కారాన్ని అందజేయడం జరిగిందని అన్నారు. ఈ సంస్థ నిర్వాహకులు డాక్టర్ సురభి శ్రీధర్, సహకరిస్తున్న రక్తదాతలకు మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# గాంధీ విగ్రహానికి పార్ట్ టైం అధ్యాపకుల వినతి



**కామారెడ్డి, ఏప్రిల్ 28 ( మనం ప్రతినిధి):** తెలంగాణ విశ్వవిద్యాలయం దక్షిణ ప్రాంగణ పార్ట్ టైం అధ్యాపకులు ఏడవ రోజు సమ్మెలో భాగంగా తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని గాంధీ విగ్రహానికి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ వారు మాట్లాడుతూ., గాంధీ దృష్టిలో విద్య అనేది సమానత్వం సాధించడానికి ఒక సాధనమని అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని గాంధీ అభిప్రాయపడ్డారు. విశ్వవిద్యాలయాలలో పనిచేసే అధ్యాపకుల విద్య దేశాభివృద్ధికి తోడ్పడుతుందనీ, అలాంటి విశ్వవిద్యాలయాలలో నేడు పనిచేస్తున్న పార్ట్ టైం అధ్యాపకుల జీవితాలకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని అన్నారు. తమకు ఇప్పటివరకు కనీస వేతనం కూడా లేదని అన్నారు. జి.ఓ 21 ని సవరించి తమ సర్వీసులను పరిగణలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో ఏర్పడిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇకనైనా పార్ట్ టైం అధ్యాపకుల న్యాయపరమైన డిమాండ్లను గుర్తించి తమకు న్యాయం చేయాలని అన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన పార్ట్ టైం అధ్యాపకులు పాల్గొన్నారు.

# ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను సత్వరమే చర్యలు చేపట్టాలి

- **కామారెడ్డి అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి. విక్టర్**



**కామారెడ్డి, ఏప్రిల్ 28 (మనం ప్రతినిధి):** ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి సత్వర చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి. విక్టర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజా వాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించే వెంటనే డిస్పోస్ చేయాలని అన్నారు. ఈ రోజు ప్రజావాణి లో (95)అర్జీలు రావడం జరిగాయని తెలిపారు. ఈ ప్రజావాణిలో ఆర్డీఓ వీణ, కలెక్టరేట్ పరిపాలన అధికారి మసూద్ అహ్మద్, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పండరిపూర్ విఠలేశ్వర స్వామిని దర్శించుకున్న పోచారం



**బాన్సువాడ, ఏప్రిల్ 28 ( మనం న్యూస్ ):** మహారాష్ట్రలోని పండరీపూర్ లోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం శ్రీ రుక్మిణీ పాండురంగ విఠలేశ్వర స్వామి వారిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస్ రెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు ఘనస్వాగతం పలికి శాలువాతో సన్మానం చేశారు. అనంతరం మరాఠీ సంప్రదాయంలో పండరిపూర్ విఠ్ఠలేశ్వరుని భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. పోచారం వెంట ఆలయ కమిటి సభ్యులు, బాన్సువాడ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

## జాతీయం- అంతర్జాతీయం

# యెమెన్ జైలుపై అమెరికా వైమానిక దాడి

- **30 మంది మృతి**

**సనా, ఏప్రిల్ 28:** యెమెన్ రాజధాని సనాలోని జైలుపై అమెరికా జరిపిన వైమానిక దాడుల్లో 30 మంది చనిపోయారని హూతీలు తెలిపారు. యెమెన్‌లోని హూతీ రెబల్స్‌పై అమెరికా భీకర దాడులు కొనసాగుతున్నాయి. ఈక్రమంలో తాజాగా యెమెన్‌లోని ఒక జైలుపై అమెరికా జరిపిన వైమానిక దాడుల్లో 30 మంది చనిపోయారని హూతీలు పేర్కొన్నారు. యెమెన్‌లో సాదా గవర్నరేట్స్‌లో అమెరికా



వైమానిక దాడులు చేసిందని హూతీలు తెలిపారు. ఆఫ్రికన్ వలసదారులు ఉన్న జైలుపై ఈ దాడి జరిగిందన్నారు. ఇందులో 30 మంది మరణించారని వెల్లడించారు. ఈ జైలులో 100 మంది ఖైదీలు ఉన్నట్లు అక్కడి మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. అయితే, ఈ తాజా దాడిని గురించి అగ్రరాజ్యం ఇప్పటివరకు ఎలాంటి ప్రకటనా చేయలేదు. కాగా.. యెమెన్ రాజధాని సనాలోనూ వైమానిక దాడులు జరిగాయి. ఈ దాడుల్లో ఎనిమిది మంది మృతి చెందినట్లు తెలుస్తోంది. ఇదిలాఉండగా.. మార్చి నుంచి ఇప్పటివరకు యెమెన్‌పై జరిపిన దాడుల్లో 800కు పైగా లక్ష్యాలని ఛేదించినట్లు అమెరికా ప్రకటించింది. అంతేకాక వందల మంది హూతీలు హతమయ్యారని మిలిటరీ కమాండ్ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ దాడుల్లో తిరుగుబాటుదారులకు చెందిన వాయు రక్షణ వ్యవస్థలు, అధునాతన ఆయుధాల తయారీ సౌకర్యాలు, నిల్వ స్థావరాలు నాశనం అయ్యాయని వెల్లడించింది. ఈసందర్భంగా తమ లక్ష్యం నెరవేరే వరకు హూతీలపై ఒత్తిడిని కొనసాగిస్తామని స్పష్టం చేసింది.

# మళ్లీ అధికారంలోకి వస్తే భారత్తో సత్సంబంధాలు..కెనడా ప్రధాని

**ఒట్టావో, ఏప్రిల్ 28:** భారత్‌తో సంబంధాలు తమకు చాలా ముఖ్యమైనవని కెనడా ప్రధాని మార్క్ కార్నీ వ్యాఖ్యానించారు. ట్రూడో అధికారంలో ఉన్న సమయంలో భారత్‌తో దెబ్బతిన్న సంబంధాలను తిరిగి పునరుద్ధరిస్తామని కెనడా ప్రధాని మార్క్ కార్నీ పలుమార్లు పేర్కొన్న విషయం తెలిసిందే. నేడు కెనడా ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలింగ్‌కు ముందు మార్క్ కార్నీ ఓ మీడియా సంస్థతో మాట్లాడుతూ భారత్‌తో సంబంధాల గురించి మాట్లాడారు. భారత్‌తో సత్సంబంధాలు కొనసాగించడం తమకు చాలా ముఖ్యమని.. తాము అధికారంలోకి వస్తే న్యూఢిల్లీతో సంబంధాలు మెరుగుపరుచుకుంటామని వ్యాఖ్యానించారు. కెనడియన్లు వ్యక్తిగతంగా, ఆర్థికంగా, వ్యూహాత్మకంగా భారత్‌తో సంబంధాలు కలిగిఉంటారన్నారు. భారత్‌తో సంబంధాలు తెగిపోవడానికి కారణమైన విభేదాలను పరిష్కరించడానికి తాము కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థికవ్యవస్థ పునర్నిర్మితమవుతున్న సమయంలో భారత్, కెనడా వంటి దేశాలు భాగస్వామ్య ఆర్థికవ్యవస్థను నిర్మించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తాయని తాను నమ్ముతున్నానని మార్క్ కార్నీ అన్నారు. ప్రస్తుతం ప్రపంచ దేశాలపై అగ్రదేశం చేస్తున్న వాణిజ్యయుద్ధం దీనికి అవకాశం కల్పిస్తుందని తెలిపారు. నేడు జరగనున్న ఫెడరల్ ఎన్నికల్లో తమ పార్టీ మెజారిటీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తంచేశారు. తాము




అధికారం చేపట్టగానే న్యూఢిల్లీతోనే కాకుండా సారూప్యత కలిగిన దేశాలతోనూ వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడానికి తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు. దశాబ్దాల తరబడి మిత్ర దేశాలుగా ఉన్న భారత్, కెనడాల మధ్య సంబంధాలు ఇటీవల బాగా దెబ్బతిన్నాయి. కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో గతంలో ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్య వెనక భారత్ ఏజెంట్ల హస్తం ఉండొచ్చని చేసిన వ్యాఖ్యలతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. భారత్ వెంటనే వాటిని తిప్పికొట్టింది. ఆ క్రమంలోనే వరసగా జరిగిన కొన్ని పరిణామాలతో ఉభయదేశాల దౌత్య, వాణిజ్య సంబంధాలు క్షీణించాయి. ఈనేపథ్యంలో కెనడాకు నూతన ప్రధానిగా అధికార లిబరల్ పార్టీ నేత మార్క్ కార్నీ ఎన్నికవడం.. ఆయన భారత్‌కు అనుకూలంగా ఉండడంతో భవిష్యత్తులో ఇరుదేశాల మధ్య సంబంధాలు మెరుగయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

నేడు (ఏప్రిల్ 28) కెనడాలో ఎన్నికలు జరగనున్నాయి. నెలరోజుల క్రితం ప్రతిపక్ష కన్జర్వేటివ్ పార్టీ కంటే చాలా వెనకబడిపోయిన లిబరల్స్ ఎన్నికలకు ముందు తిరిగి పుంజుకోవడంతో ఆ పార్టీ మరోసారి అధికారం చేపట్టే అవకాశం ఉన్నట్లు ఒపీనియన్ పోల్స్ పేర్కొంటున్నాయి. అయితే ట్రూడో నిష్క్రమణ తర్వాత లిబరల్ పార్టీ తిరిగి పుంజుకున్నట్లు వెల్లడించాయి. ఇటీవల విడుదలైన పలు ఎలక్షన్ పోల్స్‌లో లిబరల్స్‌కు 43.7 శాతం ప్రజా మద్దతు లభించగా.. కన్జర్వేటివ్స్‌కు 36.3 శాతం మద్దతు ఉన్నట్లు వెల్లడించాయి. ఇప్పటివరకు ఈ మద్దతు ఇలాగే ఉంటే 343 మంది సభ్యులున్న కెనడియన్ పార్లమెంట్లో లిబరల్ పార్టీ అధిక మెజారిటీతో విజయం సాధించే అవకాశం ఉన్నట్లు అంచనా వేశాయి.

# పహాల్గాం దాడి.. ఆ మరుసటి రోజే లష్కరే తోయిబా ఉగ్రవాదితో బంగ్లా నేత భేటీ..?

**ఢాకా, ఏప్రిల్ 28 :** పహాల్గాం దాడి తర్వాత లష్కరే తోయిబా నేతతో బంగ్లాదేశ్ న్యాయ సలహాదారు భేటీ అయినట్లు కథనాలు వెలువడ్డాయి. పహల్గాం ఉగ్ర దాడితో దేశం ఉలిక్కిపడింది. అలాంటి సమయంలో బంగ్లాదేశ్.. భారత్ వ్యతిరేక వైఖరిని కనబరిచినట్లు తెలుస్తోంది. దాడి జరిగిన మరుసటి రోజే లష్కరే తోయిబా నేత ఇజార్‌తో తాత్కాలిక ప్రభుత్వంలోని లీగల్ అడ్వైజర్ డాక్టర్ అసిఫ్ నజ్రుల్ భేటీ అయినట్లు సమాచారం. ఢాకాలో ఈ సమావేశం జరిగిందని పలు మీడియా కథనాలు వెల్లడించాయి. దీంతో ఉగ్రవాదం విషయంలో బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ విధానంపై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఇజార్‌కు బంగ్లా గడ్డ నుంచి ఉగ్రదాడులకు పాల్పడిన చరిత్ర ఉండటం ఆందోళన కలిగిస్తోంది. అయితే బంగ్లాదేశ్‌కు చెందిన ఫ్యాక్ట్ చెకింగ్ సంస్థ రూమర్ స్కానర్ భిన్నమైన కథనాన్ని ప్రచురించింది. అసిఫ్ నజ్రుల్, ఇజార్‌ల మధ్య భేటీ ఏప్రిల్ 21న జరిగిందని పేర్కొంది. అది పహల్గాం దాడి జరగడానికి ముందురోజు. పలువురు ఇస్లామిస్టులపై దాఖలైన వేధింపుల కేసుల ఉపసంహరణ నిమిత్తం ఈ సమావేశం జరిగిందని వెల్లడించింది. పహల్గాంలో ఉగ్రదాడికి తెగబడింది తామేనని 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్)' ఇప్పటికే ప్రకటించుకుంది. అయితే దాడి చేసింది ఆ సంస్థ ఉగ్రవాదులే అయినా.. చేయించింది మాత్రం లష్కరే తోయిబా చీఫ్, మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది హఫీజ్ సయీద్ అని భారత నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. ఈ దాడికి కర్త, కర్మ, క్రియ అతడే అని విశ్వసిస్తున్నాయి.

ఆయుధాల తరలింపు, ఆహారం, నివాస వసతి వంటి ఏర్పాట్ల కోసం కశ్మీర్‌లో స్థానికులను లష్కరే వాడుకుంటుంది. తన అనుబంధ సంస్థలతోనే ఎక్కువగా దాడులు చేయిస్తుంటుంది. పాక్‌లో కొందరికి ఉగ్ర శిక్షణ ఇచ్చి.. వారిని కశ్మీర్‌లోని పలు ప్రాంతాలకు పంపుతుంటుంది. వారి ద్వారా స్థానిక యువతలో విద్వేషాన్ని రగిలించి, వారిని ఉగ్రవాద కార్యకలాపాలకు ఉసిగొల్పుతుంది. అదే తరహాలో- పహల్గాంలో దాడికి తెగబడ్డ ముగ్గురు ఉగ్రవాదుల్లో ఇద్దరు పాకిస్థానీయులు, ఒక కశ్మీరీ ఉన్నట్లు నిఘా వర్గాలు భావిస్తున్నాయి. 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్) కూడా లష్కరే అనుబంధ సంస్థే కావడం గమనార్హం.

# అతిథులను కాపాడటంలో నేనూ విఫలమయ్యా

- **జమ్మూ కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా**

**జమ్ము, ఏప్రిల్ 28:** అతిథులను కాపాడటంలో తానూ విఫలమయ్యానని జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. కానీ, ఆ 26 మంది ప్రాణాలను అడ్డం పెట్టుకొని తాను రాష్ట్ర హోదాను డిమాండ్ చేయబోనని హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని జాతి తీవ్ర వేదనల్లో ఉన్నప్పుడు కాకుండా.. మరేదైనా రోజు లేవనెత్తుతానని చెప్పారు. పహల్గాం దాడిపై చర్చించేందుకు అక్కడి అసెంబ్లీ నేడు అత్యవసరంగా సమావేశమైంది. ఈ సందర్భంగా ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ ''ఇలాంటి దాడులు గతంలో చాలా చూశాం. కానీ, బైసరన్‌లో ఇంత పెద్ద స్థాయిలో దాడి చేయడం మాత్రం 21 ఏళ్లలో ఇదే తొలిసారి. మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ఎలా క్షమాపణలు చెప్పాలో కూడా తెలియడం లేదు. రాష్ట్రానికి వచ్చిన పర్యాటకులను సురక్షితంగా తిరిగి పంపాల్సిన బాధ్యత మాదే. నేను ఆ పనిచేయలేకపోయాను. క్షమాపణలు చెప్పేందుకు నా వద్ద మాటలు కరవయ్యాయి'' అని ఒమర్ అబ్దుల్లా తెలిపారు. ''పహల్గాం ఘటన తర్వాత ఏ ముఖం పెట్టుకొని రాష్ట్ర హోదాను డిమాండ్ చేయాలి. నా రాజకీయాలు అంత చౌకబారువి కాదు. గతంలో రాష్ట్ర హోదా అడిగాము.. భవిష్యత్తులో కూడా అడుగుతాము. కానీ, 26 మంది చనిపోయారు.. ఇప్పుడు రాష్ట్ర హోదా ఇవ్వండి అని కేంద్రాన్ని అడగడం సిగ్గుచేటు''అని అన్నారు. ''ప్రజలు మాకు మద్దతు ఇస్తే.. మిలిటెన్సీ, ఉగ్రవాదం అంతమవుతాయి. ఇది దానికి ఆరంభం. ఈ ఉద్యమానికి హాని కలిగించేది ఏదీ మాట్లాడకూడదు, చేయకూడదు. మేము మిలిటెన్సీని తుపాకులతో అదుపు చేయగలం.. కానీ, మాకు ప్రజల మద్దతు అవసరం'' అని అబ్దుల్లా అసెంబ్లీలో పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, పర్యాటకశాఖ మంత్రిగా వారిని కాపాడలేకపోయానన్నారు. ఏప్రిల్ 22వ తేదీన పహల్గాంలోని బైసరన్ లోయలో సేదతీరుతున్న పర్యాటకులను ఉగ్రవాదులు కాల్చి చంపారు.

# కేరళ సీఎం కార్యాలయానికి బాంబు బెదిరింపు



**తిరువనంతపురం, ఏప్రిల్ 28:** కేరళ సీఎం కార్యాలయానికి బాంబు బెదిరింపులు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. గత రెండు వారాలుగా కేరళలోని ప్రభుత్వ కార్యాలయాలకు వరుసగా వస్తున్న బాంబు బెదిరింపు కాల్స్ కలకలం సృష్టిస్తున్నాయి. తాజాగా కేరళ సీఎం కార్యాలయంతోపాటు సెక్రటేరియట్‌కు సోమవారం బాంబు బెదిరింపులు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. కొచ్చి అంతర్జాతీయ విమానాశ్రయానికి కూడా బెదిరింపు కాల్స్ వచ్చినట్లు విమానాశ్రయ అధికారులు వెల్లడించారు. దీంతో బాంబ్ స్కాడ్, పోలీసు బృందాలు ఆయా ప్రదేశాలకు చేరుకొని గాలింపు చర్యలు చేపట్టాయి. గత రెండు వారాల్లో 12 బాంబు బెదిరింపు కాల్స్ వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. ఆదివారం తిరువనంతపురం విమానాశ్రయానికి, రాజధానిలోని ప్రముఖ హోటళ్లకు బెదిరింపు మెయిల్స్ వచ్చినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న బాంబు, డాగ్ స్క్వాడ్లు విమానాశ్రయ టెర్మినల్స్‌లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించగా ఎటువంటి పేలుడు పదార్థాలు లభ్యం కాలేవని..అవి నకిలీ బెదిరింపు కాల్స్‌లాడా గుర్తించామని పేర్కొన్నారు. రెండు వారాలుగా కేరళ హైకోర్టు సహా జిల్లా కలెక్టరేట్లు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలకు బెదిరింపు మెయిల్స్ వచ్చాయన్నారు. మే 2న కేరళలో ప్రధాని నరేంద్ర మోడీ పర్యటించనున్న నేపథ్యంలో ఈ నకిలీ కాల్స్‌పై దర్యాప్తు వేగవంతం చేశామన్నారు.

# 5 ఏళ్లలో బెస్ట్ సర్జన్లుగా రోబోలు: ఎలాన్ మస్క్

**వాషింగ్టన్, ఏప్రిల్ 28:** రాబోయే 5 ఏళ్లలో రోబోలు బెస్ట్ సర్జన్లుగా మారతాయని ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ అంచనా వేశారు. కృత్రిమ మేధ (ఏఐ)) కారణంగా ఉద్యోగాలు పోయే ప్రమాదం ఉందని ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాబోయే 5 ఏళ్లలో రోబోలు వైద్యులను అధిగమించి.. బెస్ట్ సర్జన్లుగా మారతాయని అంచనా వేశారు. ప్రస్తుతం తన న్యూరాలింక్ కంపెనీలో మానవ మెదడులో కంప్యూటర్ ఎలక్ట్రోడ్లను అమర్చే పని రోబోతోనే నిర్వహిస్తున్నామని



స్పేక్ ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ వెల్లడించారు. సామాన్యంగా మానవులకు కష్టమైన ఈ పనిని రోబో వేగంగా, కచ్చితంగా చేస్తోందని అన్నారు. భవిష్యత్తు జరిగే శస్త్రచికిత్సల్లో ఆధునిక సాంకేతికతతో రూపొందించిన రోబోల వాడకం అధికమవుతుందని మస్క్ పేర్కొన్నారు. దీనివల్ల సర్జన్ల ఉద్యోగాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. మస్క్ వ్యాఖ్యలపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఓ నెటిజన్ స్పందిస్తూ.. ప్రస్తుతం శస్త్ర చికిత్సల కోసం ఉపయోగించే సర్జికల్ రోబోలు స్వయంగా పని చేయలేవని.. వాటిని మానవ సర్జన్లు నియంత్రిస్తారని అన్నారు. భవిష్యత్తులో ఎంతటి సాంకేతికత వచ్చినప్పటికీ మానవ ప్రమేయం లేకుండా యంత్రాలు అన్ని పనులు చేయలేవని అన్నారు. మస్క్ అంచనా నిజం కావాలంటే చాలాకాలం పడుతుందని.. 5 ఏళ్లలో మాత్రం సాధ్యం కాదని రాసుకొచ్చారు. మరో నెటిజన్ స్పందిస్తూ..ఒకవైపు అధిక జనాభా కావాలని కోరుతూ..మరోవైపు ప్రతి ఒక్క ఉద్యోగాలను రోబోలతో భర్తీ చేయాలని చూడడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వెన్నెముక, మెదడు సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి సహాయంగా ఉండేలా న్యూరాలింక్ (ఌ్ఘఙ్చుజూఙ్జీుజు) సంస్థ మానవ మెదడులో ఎలక్ట్రానిక్ చిప్పు అమర్చే ప్రయోగాలు చేస్తుంటుంది. ఇందులో భాగంగా ఇప్పటి వరకు ముగ్గురు వ్యక్తులకు మెదళ్లలో ఎలక్ట్రానిక్ చిప్లను అమర్చింది. తమ ప్రయోగాలతో భవిష్యత్తులో డిజిటల్ ఇంటెలిజెన్స్తో పోటీ పడగలిగే సామర్థ్యం మనిషికి వస్తుందని న్యూరాలింక్ సీఈఓ మస్క్ గతంలో అన్నారు.

# 30 లోపు పొగాకు కొనుగోలు చేయాలి

- పొగాకు కంపెనీ లను ఆదేశించిన జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య



కర్నూలు, ఏప్రిల్ 28మనం న్యూస్: మే 15 నుండి 30 వ తేదీ లోపు పొగాకు కొనుగోలు చేయాలని జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య పొగాకు కంపెనీ లను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో పొగాకు కొనుగోలుపై కంపెనీల ప్రతినిధులు, జిల్లా వ్యవసాయాధికారి, ఎ.డి మార్కెటింగ్, వ్యవసాయ శాఖ అధికారులతో జాయింట్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జేసీ పొగాకు కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతూ పొగాకు కొనుగోలు ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, అలా కాకుండా మంచి ధర ను ఇవ్వాలని సూచించారు..పూర్తిగా పొగాకు పంటను మే15 నుండి 30 వ తారీఖు లోపు కొనుగోలు చేయాలని జేసీ పొగాకు కంపెనీ ప్రతినిధులను ఆదేశించారు. ఖిఇఅ్క (సిరి పొగాకు) కు సంబంధించి కొనుగోలు కేంద్రాన్ని ఓర్వకల్లు లో ఏర్పాటు చేసి పొగాకు కొనుగోలు చేయాలని ఎ్కఐ ఔార్ఘుఇ్ఘుడని ఆదేశించారు. బీడి పొగాకు , నాటురకం పొగాకు ను కూడా పూర్తిగా కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని ఐటీసీ, జీపీఐ, వీఎస్టీ, అలియాన్స్, డెక్కన్ టోబకో, ఎస్ఎస్టీ, పీటీపీ ఎల్టీడీ కంపెనీ ప్రతినిధులను ఆదేశించారు. ఈ విషయం పై పొగాకు కంపెనీ ప్రతినిధులతో మరొక సమావేశం నిర్వహించి జిల్లాలో పండించిన పొగాకును పూర్తిగా, మంచి ధరలతో కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని జేసీ తెలియజేశారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, ఏడి మార్కెటింగ్ నారాయణమూర్తి, సహాయ వ్యవసాయ సంచాలకులు సాలు రెడ్డి, కర్నూలు డివిజన్ మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ విద్యతో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు


- జిల్లా విద్యా శాఖ అధికారి శామ్యూల్ పాల్



కర్నూలు ఏప్రిల్ 28(మనం న్యూస్)ః విద్యార్థులు విద్యతో పాటు విలువలు, సామాజిక సేవ దృక్పథం పెంపొందించుకోవాలని జిల్లా విద్యా శాఖ అధికారి శామ్యూల్ పాల్ అన్నారు. స్థానిక కర్నూలు నగరంలోని టీజీవి కళా క్షేత్రం నందు విద్య అకాడమిలో పాలిటెక్నిక్ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులకు కల్చరల్ అండ్ మోటివేషన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యా శాఖ అధికారి శామ్యూల్ పాల్ మాట్లాడుతూ ప్రణాళిక బద్ధంగా చదువుకుంటే విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని అన్నారు. పాలిటెక్నిక్ చదవడం ద్వారా ఉన్నతమైన ఉద్యోగాలు పొంది చిన్న వయసులోనే స్థిరపడవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్య అకాడమి డైరెక్టర్ కె వెంకటేశ్వరమ్మ, రాయలసీమ విద్యార్థి జెఏసి చైర్మన్ అడ్వకేట్ కోనేటి వెంకటేశ్వర్లు, విద్యావేత్తలు డాక్టర్ కెవి సుబ్బా రెడ్డి, జి పుల్లయ్య, డాక్టర్ కొట్టే చెన్నయ్య, కార్తీక్ నాయుడు, రఘు వీర్, బాల రాజు, చింతలపల్లి రామకృష్ణ, టి గోపీనాథ్, అంచ పెద్దస్వామి, బుర్రా చంద్ర మోహన్, సురేంద్ర బాపూజీ, ముద్దం మధు సుదన రావు, రిటైర్డ్ ఆర్టీవో కోనేటి చంద్రబాబు, ప్రముఖ జర్నలిస్టు వడ్ల శ్రీకాంత్, రిటైర్డ్ ఆర్మీ కెప్టెన్ సాన మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

# 30న కామన్ పాలిటెక్నిక్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్స్

- పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబడవు.
- కామన్ పాలిటెక్నిక్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్స్ పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి
- డిఆర్ఓ సి.వెంకటనారాయణమ్మ



కర్నూలు ఏప్రిల్ 28మనం న్యూస్ : కామన్ పాలిటెక్నిక్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్స్ నిర్వహణకు పగడ్బందిగా ఏర్పాట్లు చేయాలని డిఆర్ఓ సి.వెంకటనారాయణమ్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ఈనెల 30 వ తేదీన నిర్వహించే కామన్ పాలిటెక్నిక్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్స్ నిర్వహణపై సంబంధిత అధికారులతో జిల్లా రెవిన్యూ అధికారి సి.వెంకటనారాయణమ్మ సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ ఈ నెల 30 వ తేదిన నిర్వహించే కామన్ పాలిటెక్నిక్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్స్ పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కర్నూలు జిల్లా కేంద్రంలో 12 సెంటర్లల లో 4584 మంది, ఆదోని లోని 10 సెంటర్లలో 2768 మంది మొత్తం 22 సెంటర్లలో 7352 మంది విద్యార్థులు హాజరవుతున్నారని అన్నారు. ఈ పరీక్షలు ఉదయం 11 గంటల నుంచి 1 గంట వరకు జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబడవని అన్నారు. ఏపీ ఎస్పీడీసీఎల్ వారు పరీక్ష కేంద్రాల్లో కరెంటు అంతరాయం లేకుండా చూడాలని, పోలీసు అధికారులు పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని, మున్సిపల్ వారు పరీక్ష కేంద్రాల వద్ద త్రాగు నీటి సదుపాయం కలిగించాలని, వైద్య ఆరోగ్యశాఖ వారు పరీక్ష కేంద్రాల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అవసరమైన ప్రథమ చికిత్స కు సంబంధించిన మెడిసిన్స్ అందుబాటులో ఉంచుకోవాలని డిఆర్ఓ సంబంధిత అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో విజయశ్రీ, పాలిటెక్నిక్ ఎగ్జామినేషన్ జిల్లా కోఆర్డినేటర్ ఓ శ్రీధర్ , కర్నూలు రూరల్ తహశీల్దార్ రమేష్ బాబు, అర్బన్ తహశీల్దార్ వెంకటలక్ష్మి, ఏపీఎస్పీడీసీఎల్ సిబ్బంది, పోలీస్ శాఖ వారు, వైద్య ఆరోగ్యశాఖ వారు, తదితరులు పాల్గొన్నారు.

# ఫుడ్ ప్రాసెసింగ్ రంగం అభివృద్ధికి సహకరించండి



కర్నూలు ఏప్రిల్ 28మనం న్యూస్ః ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి అగ్రగామి గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్ను స్థాపించడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. ఆంధ్రప్రదేశ్లో ఫుడ్ ప్రాసెసింగ్ రంగం అభివృద్ధికి పూర్తిగా సహకరించాలని కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ను.. మంత్రి టి.జి భరత్ కోరారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసిన రాష్ట్ర మంత్రి టి.జి భరత్ ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి సంబంధించి కీలక అంశాలపై చర్చించారు. టమోటా పంటను అధికంగా పండిస్తున్న రాయలసీమ జిల్లాల్లో ఆపరేషన్ గ్రీన్స్ పథకం కింద మొదటి విడత రెండవ విడత మొత్తా రూ. 9.76 కోట్లు విడుదల చేయాలని మంత్రి టి.జి భరత్ కోరారు. ఆరు నెలల్లోపు మొత్తం ప్రాజెక్టు త్వరగా పూర్తి చేయడానికి మిగిలిన గ్రాంట్ మొత్తం రూ. 34.17 కోట్లు విడుదల చేయాలని వినతిపత్రం ద్వారా కోరారు. రాయలసీమ జిల్లాల్లో రైతులు టమోటా పంటను అత్యధికంగా సాగు చేస్తారని కేంద్ర మంత్రికి వివరించారు. టమోటా ప్రైమరీ ప్రాసెసింగ్ సెంటర్స్ ఏర్పాటుచేయడం ద్వారా పంట కోత తర్వాత నష్టం జరగకుండా చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలోని దక్షిణ ప్రాంతానికి ఈ కేంద్రాలు ఎంతో ముఖ్యమైనవని చెప్పారు. దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలలో ఒకటిగా ఆంధ్రప్రదేశ్ అవతరించిందన్నారు. ఇక రాష్ట్రంలోని అన్ని జిల్లాలను అభివృద్ధి చేసేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలలో 175 పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి టి.జి భరత్.. కేంద్ర మంత్రికి వివరించారు. ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లను అభివృద్ధి చేయడం, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పీఎంకేఎస్వై స్కీమ్స్ కింద ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టాలనుకునే వారు ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా నేరుగా అప్లై చేసుకునేలా ఏపీకి వెసులుబాటు కల్పించాలని మంత్రి టి.జి భరత్ కోరారు. ఇప్పుడున్న ప్రక్రియ పెట్టుబడుల ప్రతిపాదనలను సకాలంలో సమర్పించడానికి ఒక అడ్డంకిగా ఉందన్నారు. రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగం అభివృద్ధికి ఎంతో దోహదపడే ఈ అంశాన్ని పరిశీలించాలని కేంద్ర మంత్రిని కోరారు. ఈ సందర్భంగా తిరుపతి ఐఐటీలో ప్రధాన మంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ప్రైజెస్ పథకం కింద రూ. 2.67 కోట్ల గ్రాంట్తో స్థాపించిన ఇంక్యూబేషన్ సెంటర్ ప్రారంభోత్సవానికి రావాలని కేంద్ర మంత్రిని ఆహ్వానించారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి సంబందించిన అంశాలపై కేంద్ర మంత్రి సాను కూలంగా స్పందించినట్లు మంత్రి తెలిపారు.

# యూజీ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేయండి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



కర్నూలు, ఏప్రిల్ 28 (మనం న్యూస్)ః మే 4 వ తేదీన నీట్ఖఎ పరీక్ష నిర్వహణ సందర్భంగా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం యూజీ పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై చీఫ్ సూపరింటెండెంట్ లు, లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే 4 వ తేదీన నీట్ యూజీ పరీక్ష కర్నూలు నగరం లోని 16 కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు.. పరీక్షకు 4466 విద్యార్థులు హాజరు కానున్నారన్నారు..ఈ పరీక్ష మే 4 వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు నిర్వహించబడుతుందన్నారు.పరీక్ష నిర్వహణ లో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఒక్కొక్క పరీక్షా కేంద్రం వద్ద 2+2 పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని కలెక్టర్ పోలీస్ అధికారులను ఆదేశించారు..అలాగే పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా కేంద్రాల వద్ద 163 ఆ్రఖిఖి ట్ఛ్టిజీ్ఞు విధించాలని తహసీల్దార్ లను ఆదేశించారు. పరీక్షా కేంద్రాలలో నిరంతరాయంగా విద్యుత్ సౌకర్యం ఉండాలని,తాగు నీటి వసతి కల్పించాలని, విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు సరైన సమయానికి చేరుకునేందుకు అవసరమైన బస్సు సదుపాయాలు కల్పించాలని, రవాణా విషయంలో ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. పరీక్ష కేంద్రాల దగ్గర మెడికల్ స్టాఫ్ తో పాటు, ఓఆర్ఎస్, మెడికల్ కిట్లు ఏర్పాటు చేసి అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద దివ్యాంగ విద్యార్థుల కొరకు ప్రత్యేకంగా సెంటర్ కు 3,4 వీల్ చైర్ ల చొప్పున ఏర్పాటు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సెంటర్లలో అన్ని సౌకర్యాలు ఉన్నాయా లేదా అని ముందుగా విజిట్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రశ్నపత్రాలను సేఫ్ కస్టడీ లో ఉంచేలా తగిన చర్యలు తీసుకోవాలని డీఆర్వో ను ఆదేశించారు. జిల్లా స్థాయిలో ఒక హెల్ప్ లైన్ ను ఏర్పాటు చేయాలని కలెక్టర్ డీఆర్వో ను ఆదేశించారు..నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆదేశించిన విధంగా నీట్ యూజీ పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఓ సి.వెంకటనారాయణమ్మ, నోడల్ అధికారి పాయల్ ప్రియదర్శిని, డిఎస్పీ బాబు ప్రసాద్, అదనపు డిఎంహెచ్వో డా.భాస్కర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ ధారణపై అవగాహన



మహానంది, ఏప్రిల్28(మనంన్యూస్)ః వాహన దారులు హెల్మెట్ ధరించి క్షేమంగా గమ్యం చేరాలని మహానంది ఎస్ఐ ఎన్ .రామ్మోహన్ రెడ్డి తెలిపారు. సోమవారం మహానంది మండలం గాజులపల్లి గ్రామ పరిధిలోని బోయలకుంట్ల మెట్ట ఆర్చి వద్ద ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీలలో వాహనాలకు సంబంధించి సరైన ధ్రువ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్లు లేని పలువురికి జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు. వాహన దారులు తప్పకుండా హెల్మెట్ ధరించి, వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు, లైసెన్సులు కలిగి ఉండాలని, లేని యెడల జరిమానాలు విధిస్తామని తెలిపారు.మద్యం సేవించి వాహనాలు నడప రాదని, త్రిబుల్ రైడింగ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మహానందీశ్వరుని సన్నిధిలో కలెక్టర్ దంపతుల పూజలు



మహానంది, ఏప్రిల్28 (మనంన్యూస్)ః మహానంది పుణ్యక్షేత్రంలో నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా దంపతులు సోమవారం పూజలు నిర్వహించారు. స్వామి వారి దర్శనార్థమై వచ్చిన వీరికి ఈఓ శ్రీనివాసరెడ్డి రెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.అనంతరం శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి వారికి అభిషేకార్చన పూజలు నిర్వహించారు. ఆలయ ఆనవాయితీ ప్రకారం కలెక్టర్ దంపతులను ఈఓ శేష వస్త్రాంతో సత్కరించి, స్వామివారి జ్ఞాపికను అందజేయగా, వేద పండితులు వేద ఆశీర్వచనాలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.వారివెంట ఏ ఈఓ మధు, సూపర్డెంట్ శశిధర్ రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ మల్లయ్య, ఆర్ ఎస్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

# అదృష్టానికి వజ్రాన్వేషణ



తుగ్గలి,ఏప్రిల్ 28( మనం న్యూస్)ః అక్కడ వర్షాలు పడితే చాలు ఆరేళ్ల పిల్లల నుంచి అరవై ఏళ్లు దాటిన వృద్ధులు కూడా వేట మొదలుపెడతారు.అది మామూలు వేట కాదు,అదృష్టాన్ని వెతుక్కుంటూ వెళ్లే వజ్రాల వేట. ఇది ఎక్కడో కాదు కర్నూలు జిల్లా, తుగ్గలి మండల పరిధిలోని సోమవారం జొన్నగిరి తదితర గ్రామ పొలాల్లో వజ్రాన్వేషణలో ప్రజలు నిమగ్నమయ్యారు.వర్షాలు పడుతుండడంతో వజ్రాలు దొరుకుతాయని ఆశతో సుదూర ప్రాంతాల నుంచి ఉదయాన్నే పొలాల్లో వాలిపోతున్నారు.జనాలు ఉదయము నుంచి సాయంత్రం వరకు వజ్రాన్వేషణ చేస్తున్నారు. ఒక్క వజ్రం దొరికితే తమ కష్టాలు తీరతాయని,జీవితం మారుతుందని వజ్రాన్వేషణ చేస్తుంటారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సమాచార కేంద్రాల తనిఖీ



దేవనకొండ, ఏప్రిల్ 28 (మనం న్యూస్ )ః తెర్నేకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఈదుల దేవర బండ గ్రామంలో జరుగుతున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని జిల్లా నోడల్ అధికారి డాక్టర్.రఘు గారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వడదెబ్బ నివారణ చర్యల గురించి తెలియజేయాలని తమ పనులు ముగించుకొని ప్రదేశాలలో ఉండాలని తప్పనిసరిగా బయట ఎండలో వెళ్లవలసినచో గొడుగు, టోపీ, తలపై టవలు పెట్టుకొని కాళ్లకు చెప్పులు ధరించి వెళ్లాలని,నీళ్ల బాటిల్ తీసుకొని గంట గంటకు నీళ్లు త్రాగలని లేనిచో శరీరంలోని నీరు లవణాలు చెమట రూపంలో ఆవిరైపోయి శరీరం నీరసంతో వడదెబ్బకు గురవుతారనితెలిపారు. వడదెబ్బకు గురైన వ్యక్తిని త్వరగా నీడ గల ప్రదేశానికి మార్చాలని మరియు చల్లని గాలి తగిలేటట్లు చూడాలని, దుస్తులు వదులు చేసి, చల్లని నీటితో ముంచిన బట్టతో తరచుగా శరీరం తడవాలని, ఓ.ఆర్. ఎస్. ప్యాకెట్లు అన్నీ సచివాలయాలు, హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్స్, ప్రాథమిక మరియు పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ఒకవేళ వడదెబ్బ లక్షణాలు ఉన్నట్లయితే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి చికిత్స అందుతున్నట్లు చూడాలనివారు తెలిపారు. ముఖ్యంగా చిన్నారులు గర్భిణీ స్త్రీలు, బాలింతలు మరియు వృద్ధులు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్త వహించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్.వెంకటేశ్వర్లు, సామాజిక ఆరోగ్య అధికారి భాగ్యలక్ష్మి, ఆరోగ్య కార్యకర్త సుంకన్న, ఆశా కార్యకర్త మరియు ప్రాజెక్టు నిష్టు ఖలీల్ పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ లకు రుణాలు మంజూరు చేయాలి

హైదరాబాద్, ఏప్రిల్ 28 (మనం న్యూస్)ః తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో ఎలాంటి జీత భత్యాలు లేకుండా నిత్యం ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిస్వార్థంగా సేవ చేస్తున్న జర్నలిస్ట్ లకు ప్రత్యేకంగా రుణాలను కేటాయించాలని అల్ డెమొక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తీగల శ్రీనివాస్ రావు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆయన పత్రిక సమావేశంలో మాట్లాడుతూ, యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలనే గొప్ప ఉద్దేశం తో ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం ఉన్నత చదువులు చదివి జర్నలిస్ట్ వృత్తిలో కొనసాగుతున్న వారికి ప్రత్యేక అవకాశం కల్పించినట్లైతే వారిని ఆర్థిక అభివృద్ధికి ప్రోత్సాహించినట్టు అవుతుందని అన్నారు.ఎన్ని ప్రభుత్వాలు మారినా జర్నలిస్ట్ జీవితాలు మారలేదన్నారు.

## ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ కొవ్వొత్తులతో నిరసన

బేతంచేర్ల, ఏప్రిల్ 28(మనంన్యూస్)ః మండల పట్టణ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జమ్మూ కాశ్మీర్ లోపహల్గాం లో ఉగ్రదాడిలో 30 మంది మరణించడంతో దాడిని ఖండిస్తూ షాలేము చర్చిలో మృతి చెందిన వారికి కోవతులతో మౌనం పాటించి నివాళులర్పించారు భారతీయులపై మత వివక్షతతో దాడి చేయడం ఉగ్రవాదుల హేయమైన చర్య అని మండల పాస్టర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దాసన్న సెక్రెటరీ ప్రసాద్ అన్నారు ఉగ్రవాదుల దాడిని కులం మతం కు అతీతంగా భారతీయులందరూ కలిసికట్టుగా ఎదుర్కొంటామని అన్నారు ఈ కార్యక్రమంలో పాస్టర్స్ కుమార్ మల్లేష్ దేవరాజు క్రైస్తవులు భాస్కర్ వరప్రసాద్ వేణుగోపాల్ ప్రభుదాసు క్రైస్తవ విశ్వాసులు పాల్పొల్గొన్నారు.








# భారత క్రికెట్‌లో నయా సంచలనం ప్రతీక..



ప్రతీక రావల్.. ప్రస్తుతం భారత మహిళల క్రికెట్ లో మార్మోగుతున్న పేరు. అంతర్జాతీయ క్రికెట్లోకి ఈ అమ్మాయి అడుగుపెట్టి నాలుగు నెలలే అవుతోంది. కానీ, నిలకడగా రాణిస్తూ జట్టులో తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటోంది. మిథాలీ రాజ్, హర్మన్ ప్రీత్, స్మృతి మంధాన, షెఫాలి వర్మల బాటలో మరో స్టార్ బ్యాటర్ తయారవుతోందనే అంచనాలు ఈ అమ్మాయిపై కలుగుతున్నాయి. దిల్లీకి చెందిన 24 ఏళ్ల ప్రతీక రావల్.. గతేడాది డిసెంబరు 22న అంతర్జాతీయ క్రికెట్లోకి అడుగుపెట్టింది. దేశవాళీల్లో సత్తా చాటి భారత మహిళల వన్డే జట్టులో చోటు సంపాదించిన ప్రతీక.. వెస్టిండీస్తో తన తొలి అంతర్జాతీయ మ్యాచ్ ఆడింది. ఓపెనింగ్ బ్యాటర్ అయిన ప్రతీక.. తొలి మ్యాచ్ లోనే ఆత్మవిశ్వాసంతో బ్యాటింగ్ చేస్తూ 69 బంతుల్లో 40 పరుగులు సాధించి బలమైన పునాది వేసింది. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. 76, 18, 89, 67, 154, 50 నాటౌట్.. తర్వాతి ఆరు వన్డే ఇన్నింగ్స్ ల్లో ప్రతీక స్కోర్లు ఇవి. ఏడు మ్యాచ్ ల్లో 82.33 సగటుతో ఆమె 494 పరుగులు సాధించింది. అందులో ఒక శతకం, నాలుగు అర్ధశతకాలు ఉన్నాయి. వన్డే కెరీర్ తొలి పది మ్యాచ్ ల్లోపు ఇంత గొప్ప గణాంకాలు నమోదు చేసిన భారత బ్యాటర్ మరొకరు లేరు. స్మృతి మంధానతో కలసి జట్టుకు అద్భుత ఆరంభాలందిస్తూ తక్కువ సమయంలోనే వన్డే జట్టులో కీలక బ్యాటర్గా ఎదిగింది. గత మ్యాచ్ లో ఐర్లాండ్ పై భారీ శతకం బాదిన ఆమె.. తాజాగా శ్రీలంకలో ఆరంభమైన ముక్కోణపు వన్డే సిరీస్ లో ఆతిథ్య జట్టుపై అజేయ అర్ధశతకంతో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది. ఏడు వన్డేల్లో ప్రతీకకిది మూడో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు కావడం విశేషం. కుడిచేతి వాటం బ్యాటర్ అయిన ఆమెకు మంచి టెక్నిక్ ఉంది. అవసరమైతే దూకుడుగానూ ఆడగలదు. చక్కటి టైమింగ్తో షాట్లు కొడుతుంది. ఓపిగ్గా క్రీజులో నిలిచి సుదీర్ఘ ఇన్నింగ్స్ లు ఆడగల నైపుణ్యంతో విమర్శకుల ప్రశంసలు అందుకుంటోంది.

ప్రతీక ఉపయుక్తమైన ఆఫ్ స్పిన్నర్ కూడా. వెస్టిండీస్తో ఓ మ్యాచ్ లో 2 వికెట్లు తీసింది. చక్కటి ఫీల్డింగ్ తోనూ ఆకట్టుకుంటోంది. ఇదే నిలకడను కొనసాగిస్తే మేటి ఆల్రౌండర్ గా పేరు తెచ్చుకునే అవకాశముంది. ఇదే దూకుడు కొనసాగిస్తే, త్వరలోనే ఆమెను టీ20 జట్టులోనూ చూడొచ్చు. వచ్చే ఏడాది మహిళల ప్రీమియర్ లీగ్ లోకి ప్రతీక రావడం కూడా లాంఛనమే. గత వేలం సమయానికి ఆమె గురించి ఫ్రాంఛైజీలకు తెలియదు. అందుకే ఈ సీజన్ లో ఆడలేదు. ప్రస్తుతం ఆమె నిలకడను చూస్తున్న ఫ్రాంఛైజీలు వచ్చే ఏడాది తన కోసం పోటీ పడితే ఆశ్చర్యమేమీ లేదు.

## గుజరాత్‌పై రాజస్థాన్ ఘన విజయం

వరుసగా ఐదు ఓటముల తర్వాత ఎట్టకేలకు రాజస్థాన్ మూడో విజయం సాధించింది. గుజరాత్



తో జరిగిన మ్యాచ్ లో ఆ జట్టు 8 వికెట్ల తేడాతో నెగ్గింది. తొలుత గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. అనంతరం రాజస్థాన్ 15.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. వైభవ్ సూర్యవంశీ (101: 38 బంతుల్లో 7 ఫోర్లు, 11 సిక్స్ లు) సంచలన ఇన్నింగ్స్ ఆడాడు. మరో ఓపెనర్ యశస్వి జైస్వాల్ (70≠: 40 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్ లు) అర్ధశతకంతో చెలరేగాడు. గుజరాత్ బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ, రషీద్ చెరో వికెట్ తీశారు.

## 2028 నుంచి ఐపీఎల్‌లో 94 మ్యాచ్లు?

ఇండియన్ ప్రీమియర్ లీగ్ ను మరో 20 మ్యాచ్ లకు విస్తరించాలని భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు యోచిస్తోందని ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ వెల్లడించారు. అయితే, ఇప్పట్లో కొత్త ఫ్రాంఛైజీలను ప్రవేశపెట్టే ఆలోచన లేదన్నారు. ప్రస్తుతం ఉన్న ఐపీఎల్ మీడియా హక్కుల కాలపరిమితి 2027 వరకు ఉంది. తదుపరి (2028) ఐపీఎల్ మీడియా హక్కుల సైకిల్ ప్రారంభంకానుంది. అప్పటి నుంచి 94 మ్యాచ్ లు నిర్వహించేందుకు అవకాశాలు ఉన్నాయని ఐపీఎల్ ఛైర్మన్ తెలిపారు. 'దీని గురించి ఐసీసీలో చర్చిస్తున్నాం. బీసీసీఐలోనూ అంతర్గత చర్చ జరుగుతోంది. ఫ్రాంఛైజీ క్రికెట్, టీ20 క్రికెట్, ద్వైపాక్షిక సిరీస్ లు, ఐసీసీ ఈవెంట్ లకు సంబంధించి అభిమానుల ఆసక్తి ఎలా మారుతోంది అనే విషయాలపై మేం మరింత లోతుగా చర్చించాల్సిన అవసరముంది. టోర్నీని విస్తరించాలంటే మ్యాచ్ లను 74 నుంచి 84 లేదా 94కి పెంచాలి. ప్రతి జట్టు మిగతా అన్ని జట్లతో రెండేసి మ్యాచ్ లు (సొంత మైదానంలో ఒకటి, ప్రత్యర్థి మైదానంలో ఒకటి) 94 మ్యాచ్ లు నిర్వహించాల్సి ఉంటుంది' అని అరుణ్ ధుమాల్ వివరించారు.

**ప్రస్తుతం అనుసరిస్తున్న విధానం ఇది**

ప్రస్తుతం ప్రతి సీజన్ లో ప్లేఆఫ్స్ తో కలిపి 74 మ్యాచ్ లు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఆయా జట్లు గెలిచిన టైటిళ్ల సంఖ్య, ఫైనల్, ప్లే ఆఫ్స్ చేరిన సంఖ్య ఆధారంగా 10 జట్లకు సీడింగ్ ఇచ్చి రెండు గ్రూప్ లుగా విభజించారు. ఒకే గ్రూప్ లో ఉన్న జట్ల మధ్య రెండేసి మ్యాచ్ లు జరుగుతున్నాయి. ప్రత్యర్థి గ్రూప్ లో తమతో సమానంగా ఉన్న జట్టుతో రెండుసార్లు... మిగతా జట్లతో ఒకసారి తలపడుతున్నాయి. ఉదాహరణకు ఈ సారి ముంబయి ఇండియన్స్, ఆర్సీబీ వేర్వేరు గ్రూప్లో ఉండటంతో ఒకే సారి తలపడ్డాయి. ముంబయి, సీఎస్కే వేర్వేరు గ్రూప్ ల్లో ఉన్నా.. సేమ్ సీడింగ్ (ర్యాంకు) ఉండటంతో రెండు మ్యాచ్ ల్లో తలపడ్డాయి.

## దర్శకుడిపై హీరోయిన్ షాకింగ్ కామెంట్స్!

క్యాస్టింగ్ కౌచ్ పై ఇప్పటికే చాలా మంది హీరోయిన్స్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలోనే తాజాగా బాలీవుడ్ హీరోయిన్ నవీనా బోలే కూడా క్యాస్టింగ్ కౌచ్ పై స్పందిస్తూ చాలా బోల్ కామెంట్స్ చేసింది. ఇంతకీ, నవీనా బోలే ఏం మాట్లాడారు అంటే.. ఆమె మాటల్లోనే.. '2004-05 సమయంలో ఓ ప్రాజెక్ట్ మీటింగ్ కోసం బాలీవుడ్ డైరెక్టర్ సాజిద్ ఖాన్ ను కలిశా. అక్కడికి వెళ్లాకే అతడు ఎలాంటివాడో తెలిసింది. బట్టలు విప్పి కూర్చోమన్నాడు. నేను షాక్ అయ్యాను' అని నవీనా బోలే చెప్పుకొచ్చింది.

ఈ విషయం పై నవీనా బోలే ఇంకా మాట్లాడుతూ..'ఎందుకు దుస్తులు తీయాలి ? అని అడిగితే.. దుస్తులు లేకుండా నా బాడీ ఎంత కంఫర్టబుల్ గా ఉంటుందో చూడాలన్నాడు. వెంటనే నా ఫ్రెండ్ వేచి చూస్తోందని చెప్పి బయటకు వచ్చేశా. ఆ తర్వాత ఆయన పలుసార్లు కాల్స్ చేసినా నేను స్పందించలేదు. ఇది అప్పట్లో నన్ను ఎంతో బాధించింది. మరో దర్శకుడు కూడా నా పట్ల చాలా దారుణంగా ప్రవర్తించాడు' అని నవీనా బోలే తెలిపింది. మొత్తానికి ఇండస్ట్రీలో క్యాస్టింగ్ కౌచ్ ఎక్కువ అంటూ నవీనా బోలే చెప్పింది.

## 'రాజమౌళి' అంతిమ లక్ష్యం అదేనట!



ప్రముఖ రచయిత, రాజ్యసభ ఎంపీ విజయేంద్ర ప్రసాద్ తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో పలు ఇంట్రెస్టింగ్ విషయాలు చెప్పారు. విజయేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. 'ఏ విధంగా ఇండియా రిచ్ ?' అని అడిగినప్పుడు.. కథల విషయంలో అని చెప్పానని తెలిపారు. మహాభారతం, రామాయణంలాంటి ఇతిహాసాలు మన ఆస్తులని విజయేంద్ర ప్రసాద్ చెప్పుకొచ్చారు. అలాగే, 'బజరంగీ భాయిజాన్' సీక్వెల్, ఆమిర్ ఖాన్ డ్రీమ్ ప్రాజెక్టు గురించి విజయేంద్ర ప్రసాద్ కామెంట్స్ చేశారు. ఇంతకీ, విజయేంద్ర ప్రసాద్ ఏం కామెంట్స్ చేశారంటే.. 'కొన్ని రోజుల క్రితం సల్మాన్ఖాన్ను కలిశా. 'బజరంగీ భాయిజాన్' కొనసాగింపునకు సంబంధించి ఓ పాయింట్ చెప్పాను. అది ఆయనకు చాలా బాగా నచ్చింది. మరి ఏం జరుగుతుందో చూద్దాం. 'మహాభారతం' ప్రాజెక్టు కోసం ఆమిర్ నన్ను ఓసారి కలిశారు. ఆ తర్వాత ఏమైందో నాకు తెలియదు' అని విజయేంద్ర ప్రసాద్ తెలిపారు.

ఇక రాజమౌళి అంతిమ లక్ష్యం 'మహాభారతం' అని ఓ ప్రశ్నకు సమాధానంగా విజయేంద్ర ప్రసాద్ చెప్పారు.



## నవ్విస్తూ.. భయపెడుతూ



శుభం'తో సినీప్రియుల్ని అలరించేందుకు సిద్ధమవుతోంది నటి సమంత. ఇది ఆమె సొంత నిర్మాణ సంస్థ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై నిర్మించిన తొలి సినిమా. 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కండ్రేగుల తెరకెక్కించారు. హర్షిత్ రెడ్డి, గవిరెడ్డి శ్రీనివాస్, చరణ్ పేరి, శ్రియ కొంతం, శ్రావణి లక్ష్మి తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రం మే 9న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఆదివారం ఈ చిత్ర ట్రైలర్ ని విడుదల చేశారు. ఆ ప్రచార చిత్రంలో కనిపించిన సన్నివేశాల్ని బట్టి.. ఇది వినోదం నిండిన హారర్ థ్రిల్లర్గా ముస్తాబైనట్లు అర్థమవుతోంది. ఓ ఊర్లోని మహిళలంతా ఒక సీరియల్ చూస్తూ దెయ్యం పట్టినట్లుగా ప్రవర్తించడం.. వాళ్ల బారి నుంచి ప్రాణాలు కాపాడుకునేందుకు ఆ ఊర్లోని మగవాళ్లంతా అష్టకష్టాలు పడటం.. ఆఖర్లో సమంత మాతాజీగా ప్రత్యేక పాత్రలో కనిపించడం ట్రైలర్ లో ఆకర్షణగా నిలిచాయి. ఈ సినిమాకి సంగీతం: క్లింటన్ సెరెజో, నేపథ్య సంగీతం: వివేక్ సాగర్, ఛాయాగ్రహణం: మృదుల్ సుజిత్ సేన్.

## అప్పట్లో నాకు అది అతి పెద్ద సమస్య – మీనాక్షి



టాల్ బ్యూటీ మీనాక్షి చౌదరి 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో సాలిడ్ హిట్ కొట్టింది. ప్రస్తుతం నవీన్ పొలిశెట్టితో కలిసి 'అనగనగా ఒక రాజు' సినిమాలో నటిస్తోంది. ఐతే, మీనాక్షి.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు చెప్పింది. ఇంతకీ, మీనాక్షి చౌదరి ఏం చెప్పింది అంటే 'నా చిన్నతనంలో ఇతరులతో మాట్లాడడానికి నేను చాలా ఇబ్బంది పడేదాన్ని. ఎందుకంటే కాలేజ్ రోజుల్లోనే నా ఎత్తు 6.2 ఉండేది. ఈ కారణంగా నాతో చాలా మంది డిస్టెన్స్ మెయింటైన్ చేసేవారు' అంటూ చెప్పుకొచ్చింది. మీనాక్షి చౌదరి ఇంకా మాట్లాడుతూ.. 'నిజానికి అప్పట్లో నా ఎత్తు నాకు అతి పెద్ద సమస్య. ఆ సమయంలో నాకు చాలా బాధగా కూడా అనిపించేది. ఇక ఆర్మీ ఆఫీసర్ అయిన మా నాన్నకు ఆ విషయం గురించి చెప్తే నీ సమస్యను నువ్వే పరీక్షించుకో అని సలహా ఇచ్చారు. దీంతో అందాల పోటీల్లో పాల్గొన్నాను. ఇండస్ట్రీకి వచ్చాను. ఇక్కడ వచ్చిన ప్రతి ఆఫర్ సద్వినియోగం చేసుకున్నాను' అని మీనాక్షి చౌదరి చెప్పుకొచ్చింది.

## 'ప్రవస్తి' నీకు నేను ఉన్నా.. మేము ఉన్నాం: గీతా మాధురి

'పాడుతా తీయగా' షో గురించి గాయని ప్రవస్తి ఆరాధ్య పలు ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈ ప్రోగ్రాంలో జడ్జెస్ గా ఉన్న కీరవాణి, సునీత, చంద్రబోస్ లు వారికి నచ్చినోళ్లను మాత్రమే ఎంకరేజ్ చేస్తారని ప్రవస్తి కామెంట్ చేసింది. ఆపై షోలో ఉన్న కాస్ట్యూమ్ డిజైనర్ బాడీ షేమింగ్ వంటి వ్యాఖ్యలతో బాధపెట్టారని ఆమె వాపోయింది. ఆపై సింగర్ సునీతకు పలు ప్రశ్నలతో వీడియో కూడా విడుదల చేసింది. అయితే, ఈ వివాదంపై తాజాగా సింగర్ గీతామాధురి తన అభిప్రాయాన్ని వీడియో ద్వారా పంచుకుంది.



ప్రవస్తిని ఉద్దేశిస్తూ.. గీత మాధురి ఇలా మాట్లాడింది. 'కొన్నిసార్లు మనం ఉన్న పరిస్థితి కూడా ఇబ్బందులు తీసుకొస్తుంది. ప్రవస్తి చాలారోజులుగా పోటీలో ఉంది. దీంతో కాస్త ఒత్తిడిలో ఉండొచ్చు. ఆమెకు అందరం అండగా ఉంటాం. ఇంతవరకు జరిగిన వాటిని హార్ట్ కు తీసుకోకు. నీకు తప్పకుండా మంచి అవకాశాలు వస్తాయి. ఇతరులు చేస్తున్న కామెంట్లు అన్నీ నీకు నువ్వే ఆపాదించుకోవద్దు. మేము నీకు సపోర్ట్ ఇవ్వడానికి రెడీగా ఉన్నాం. ఇలాంటి షోస్ నుంచే నేను కూడా వచ్చాను. ఒకరి ఓటమిని చూసి చంద్రబోస్ , సునీత, ఎం ఎం కీరవాణి ఎంజాయ్ చేయాలని అనుకోరు. వారికి అందరూ ఒక్కటే. ఒక్కోసారి వారు చేసిన కామెంట్లు ఇబ్బంది పెట్టొచ్చు కానీ, వాటిని మనం తీసుకునేందుకు సిద్ధంగా ఉండాలి. ఇలాంటివన్నీ కూడా విజయానికి మెట్లు అనుకోవాలి. ఒక్కోసారి ఎవరు ఏ పాట పాడితే బాగుంటుందని ఎంపిక చేయడంలో మేనేజ్మెంట్ ప్రమేయం ఉంటుంది. ఇలా ఎన్నో డిస్కషన్స్ సెట్స్ లో అవుతూనే ఉంటాయి. కొన్నిసార్లు వాళ్లే కన్విన్స్ అయిపోయి వీళ్లకు నచ్చిన పాటలను కూడా పాడనిస్తారు. ఇలాంటివి అన్నీ సహజంగానే జరుగుతూ ఉంటాయి.

జడ్జీలుగా ఉన్న ఆ ముగ్గురిలో ఒక్కరూ కూడా.. పలాన కంటెస్టెంట్ ఎలిమినేట్ అయిపోవాలి అనుకునే వ్యక్తులు కాదు. జీవితంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్న తర్వాతే వారు ఈ స్థాయికి వచ్చారు. కానీ, కంటెస్టెంట్ స్థానంలో ఉన్న వారిపై ఒక చిన్న కామెంట్ చేసినా వారికి డిస్టర్బ్గా అనిపించడం సహజమే. అదే సమయంలో వారు ఇచ్చే చిన్న కాంప్లిమెంట్ కూడా మళ్లీ మనకు సంతోషాన్ని ఇస్తుంది. ఈ పోటీ ప్రపంచంలో ఇలాంటివి అన్నీ ఉంటాయి. వాటిని మనకు పాజిటివ్గా మలుచుకోవాలి. ఇలాంటి సమయం కోసం ఎదురుచూసిన కొందరు దానిని ఆసరాగా తీసుకొని వారిని తిట్టడం కూడా మొదలుపెట్టారు. ఎప్పుడు లేని నెగటివిటిని వినాల్సి వస్తుంది. ప్రవస్తీని తిట్టినా.. జడ్జెస్ను తిట్టినా నాకు బాధగానే ఉంది. ఇది నా ఒపీనియన్.' అంటూ గీత మాధురి చెప్పుకొచ్చింది.


Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.